గురువారం

23-11-2023

విజయవాడ ప్రచురణ

సంపుటి : 72, సంచిక : 151

పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

హాట్‌కేకుల్లా టాటా టెక్ షేర్లు..

ముంబై: టాటా గ్రూప్ నుంచి ఐపీఓకు వచ్చిన టాటా టెక్నాలజీస్ షేర్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. నిమిషాల వ్యవధిలో షేర్లు పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయ్యాయి. రూ.3042.5 కోట్లు సమీకరించేందుకు టాటా టెక్ ఐపీఓ బుధవారం ఉదయం ప్రారంభమైంది. ఆఫర్ ఫర్ సేల్ కింద నాలుగున్నర కోట్ల షేర్లు అందుబాటులో ఉంచగా సబ్‌స్క్రిప్షన్లు తెరిచిన 40 నిమిషాల్లోనే పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయ్యాయి. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ల కోటా 2.72 రెట్లు, క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల కోటా 1.98 రెట్లు, రిటైల్ పోర్షన్ 1.63 రెట్లు సబ్‌స్క్రైబ్ కాగా యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.791కోట్లు వచ్చాయి.

శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్‌పై దాడి కేసులో

పంజాబ్, హరియాణాలో ఎన్ఐఏ సోదాలు

చండీగఢ్: శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్‌పై ఖాలిస్తానీ దాడులపై విచారణలో భాగంగా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) బుధవారం పంజాబ్, హరియాణాలోని 15 ప్రాంతాలను సోదా చేసింది. సీసీటీవీ ఫుటేజి ఆధారంగా 45 మందిని గుర్తించినట్లు వెల్లడించాయి. మార్చి 19, జులై 2వ తేదీల్లో

- మిగతా 2 లో

తేలని పంచాయితీ

- కృష్ణా ట్రిబ్యునల్ విచారణ రెండు నెలలు వాయిదా
- స్టేట్‌మెంట్ ఆఫ్ కేసు ఫైల్ చేయాలని రెండు రాష్ట్రాలకు ఆదేశం
- రాష్ట్ర ప్రభుత్వ వినతులను పట్టించుకోని కేంద్రం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కృష్ణా జలాల పంపిణీ నూతన విధివిధానాల అంశంపై విచారణను ట్రిబ్యునల్ రెండు నెలలు వాయిదా వేసింది. తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీపై ట్రిబ్యునల్ ఈ నెల 22, 23 తేదీల్లో విచారణ చేయాల్సి ఉంది. అక్టోబరు 6వ తేదీన కేంద్రం జారీ చేసిన విధివిధానాలపై రెండు వర్గాల వాదనలు వింటూ విచారణ జరపాల్సి ఉంది. తెలంగాణ అధికారులు వాయిదా కోరడంతో స్టేట్‌మెంట్ ఆఫ్ కేసు ఫైల్ చేయాలని తెలుగు రాష్ట్రాలను కృష్ణా ట్రిబ్యునల్ ఆదేశిస్తూ జనవరి 22వ తేదీకి విచారణను వాయిదా వేసింది. కృష్ణా జలాల పున:పంపిణీపై కేంద్రం జారీ చేసిన గెజిట్‌పై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈనెల 29న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేసిన పిటిషన్ విచారణకు రానుంది. అయితే కేంద్ర గెజిట్‌పై సర్వోన్నత న్యాయస్థానం స్టే ఇవ్వకపోవడంతో కృష్ణా ట్రిబ్యునల్ విచారణ కొనసాగిస్తోంది. అక్టోబరు 6న కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆ మరుసటి రోజునే కృష్ణా జలాలపై రాష్ట్ర హక్కులకు విఘాతం కలిగించకుండా పరిరక్షించాలని ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. అంతర్ రాష్ట్ర నదీ జల వివాదాల చట్టం-1956లో సెక్షన్-1 ప్రకారం కొనసాగుతున్న కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2కు మరిన్ని విధివిధానాల జారీకి కేంద్ర మంత్రివర్గం

- మిగతా 2 లో

పెండింగ్ బిల్లులు

తక్షణమే చెల్లించాలి

- ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన కాంట్రాక్టర్లు
- విజయవాడలో నిరసన ధర్నా

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): పెండింగ్ బిల్లులు చెల్లించాలని విజయవాడలో 26 జిల్లాలకు చెందిన కాంట్రాక్టర్లు ఆందోళన చేపట్టారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులో రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖలలో వివిధ గ్రాంట్ల కింద అభివృద్ధి పనులు చేపట్టి, పూర్తి చేసిన వాటికి బిల్లుల నిధులను వెంటనే విడుదల చేయాలని అనేకమంది కాంట్రాక్టర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలికంగా చెల్లింపులు చేయని కారణంగా తాము ఆర్థికంగా, మానసికంగా అనేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) ఆంధ్ర ప్రదేశ్ శాఖ అధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ (ఎస్ఏబీసీఏ) సంపూర్ణ మద్దతుతో పెండింగ్ బిల్లులు

- మిగతా 2 లో

9 జిల్లాలకు భారీ వర్ష సూచన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఏపీలో కొన్ని జిల్లాల్లో ఓ మోస్తరు వర్షపాతం నమోదైంది. ఉత్తరాంధ్ర, రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. నైరుతి రుతుపవనాల ప్రభావం ఏపీలో పెద్దగా కనిపించలేదు గానీ అల్పపీడనం వల్ల చెదురుమదురు వర్షాలు పడుతున్నాయి. ప్రస్తుత అల్పపీడనం వల్ల తొమ్మిది జిల్లాల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షపాతం నమోదువుతుందని ఐఎండీ అంచనా వేసింది. ముఖ్యంగా పల్నాడు, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, నెల్లూరు, కడప, అన్నమయ్య రాయచోటి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షపాతం నమోదవుతుందని, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. బుధవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో

- మిగతా 2 లో

'దివైర్' ఎడిటర్ అర్ఫా ఖానూమ్ షేర్వానికి

'ఛత్రపతి సమ్మాన్'

జర్నలిస్టులు సజీవంగా ఉన్నప్పుడే అండగా నిలవాలని పిలుపు

న్యూదిల్లీ: ది వైర్ సీనియర్ ఎడిటర్ అర్ఫా ఖానూమ్ షేర్వానిని ఛత్రపతి సమ్మాన్ అవార్డుతో బుధవారం సన్మానించారు. గాజాలో విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోయిన జర్నలిస్టులకు ఈ అవార్డును అంకితమిస్తున్నట్లు అర్ఫా ప్రకటించారు. అవార్డు అందుకున్న తర్వాత మాట్లాడుతూ 'జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయేంత వరకు వేచివుండవద్దు. వారు బతికి ఉన్నప్పుడే మద్దతు/సంఘీభావం అందజేయండి' అని ఆమె పిలుపునిచ్చారు. 'భారత జర్నలిజానికి ప్రస్తుతం అత్యంత దుర్దశ. జర్నలిస్టులను దేశద్రోహులుగా, ఉగ్రవాదులుగా ముద్రవేసే కాలంలో ఉన్నాం. ప్రధాన స్రవంతి మీడియా చాలావరకు నరేంద్రమోదీకి ప్రచార మాధ్యమంగా మారింది. శక్తిమంతమైన వారిని ప్రశ్నించే, అణగారిన వర్గాల సమస్యలను లేవనెత్తే మా లాంటి వారు కఠిన శిక్షలను అనుభవించాల్సి వస్తోంది. అధికారంలో ఉన్న వారు పాత్రికేయులను మనుషులుగా చూడటం మానేశారు. వారిపై ఎలాంటి

- మిగతా 2 లో

ఇదీ లోకం!

వంతెన మన ప్రభుత్వ హయాంలో కట్టిందా!? అయితే పద్దు వెనక్కి వెళిపోదాం పద.

విలీనం... నయవంచన

- ఆర్టీసీ ఉద్యోగులకు తీరని నష్టం
- వేతన స్కేలులో ప్రభుత్వ జిమ్మిక్కు
- పెరగని వేతనాలు... అందని వైద్యం
- పాత స్కీముల రద్దు
- ప్రభుత్వ తీరుపై ఉద్యోగుల ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసినట్లు ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్నప్పటికీ... విలీనం వల్ల తమకు వీసమెత్తు ప్రయోజనం కలగకపోగా అప్పటికే ఉన్న ప్రయోజనాలు దెబ్బతిన్నాయని, విలీనం పేరుతో ప్రభుత్వం ఆడిన నాటకంలో తాము బలిపశువులుగా మారిపోయామని ఆర్టీసీ ఉద్యోగులు వాపోతున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులు 2020 జనవరి 1 నుండి ప్రభుత్వంలో విలీనం అయ్యారు. ఏలూరు జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోలలో 1100, పశ్చిమగోదావరి జిల్లాలోని భీమవరం, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం, డిపోలలో 1300 మంది ఆర్టీసీ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వంలో విలీనంతో ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, ప్రయోజనాలు అంది... తమ కష్టాలన్నీ తీరిపోతాయని వారంతా భావించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సంబరాలు చేసుకున్నారు. ఇప్పుడు మాత్రం విలీనం కోరుకుని తాము పెద్ద తప్పు చేశామని బాధపడుతున్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగుల కంటే 19 శాతం వేతనాలు తక్కువ. ప్రభుత్వంలో విలీనమైతే ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలతో సమానంగా తమ వేతనాలు కూడా పెంచుతారని ఆర్టీసీ సిబ్బంది భావించారు. కానీ ప్రభుత్వం ఆర్టీసీలో ఉద్యోగ హోదా ఆధారంగా వేతన స్కేలు ఇవ్వకుండా వారికున్న వేతనాలు ఆధారంగా పే స్కేలు ఇచ్చింది. ఆర్టీసీలో ఉన్న వేతనంతో సమానంగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల వేతన స్కేలును మాత్రమే వారికి ఇచ్చింది. ఫలితంగా ఆర్టీసీ ఉద్యోగులు 2019 నాటి వేతనాలతోనే సరిపుచ్చుకోవాల్సి వస్తోంది.

అన్ని విధాలుగా నష్టమే...

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతి నాలుగేళ్లకు ఒక పీఆర్సీ ఉంటుంది. ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఈ పీఆర్సీ ఐదేళ్లకు పెరిగింది. అయితే పదేళ్లకు మారే అవకాశం ఉందని గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో ఉద్యోగులు మరింత ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల కంటే డిఏ 8 శాతం వీరికి తక్కువగా ఉంది. ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన కారణంగా గృహ అలవెన్స్ 4 శాతం వరకు తగ్గిందని ఉద్యోగులు వాపోతున్నారు. నగరాలలో హెచ్ఆర్ఏ 16 నుంచి 12 శాతానికి, గ్రేడ్ వన్ మున్సిపాలిటీలలో 14.5శాతం నుండి 12 శాతానికి తగ్గిందని చెబుతున్నారు. ఆర్టీసీ లో ఉండగా ప్రతి నెల ఒకటవ తేదీన వేతనాలు వచ్చేవని... పండుగ సమయాలలో ఐదారు రోజులు ముందుగానే వేతనాలు పడేవని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని చెబుతున్నారు. ప్రభుత్వంలో విలీనం కాకుండా ఉంటే 2020లో మరో పీఆర్సీ అమలు జరిగేదని...దానివల్ల ఇంతకంటే మెరుగైన వేతనాలు అందుకునే వారమంటున్నారు.

పాత స్కీములన్నీ రద్దు

ఆర్టీసీలో ఉన్న సమయంలో ఉద్యోగులకు ఆరోగ్య సమస్య తలెత్తితే ఎంత ఖర్చయినా సంస్థ వైద్యం అందించేది. ఇప్పుడు ఉద్యోగులు ప్రతినెలా రూ.225 చెల్లించి ఈ హెచ్ఎస్ కార్డు తీసుకున్నప్పటికీ అది ఎందుకు పనికి రావడం

- మిగతా 2 లో

విశాఖలో లారీని ఢీకొట్టిన ఆటో

- 8 మంది పాఠశాల విద్యార్థులకు గాయాలు
- వారిలో ఇద్దరి పరిస్థితి విషమం
- డ్రైవర్ ఆటోను వేగంగా నడపటమే కారణం

8లో

4 రోజులు కాల్పుల విరమణ

- బందీల విడుదలకు ఇజ్రాయిల్, హమాస్ అంగీకారం
- నేటి నుంచి అమలు

ఇజ్రాయిల్-హమాస్ మధ్య ఎట్టకేలకు సంధి కుదిరింది. గాజాలో నాలుగు రోజుల కాల్పుల విరమణ, బందీల విడుదలకు, మానవతా సాయాన్ని అనుమతించేందుకు అంగీకరించినట్లు ఇజ్రాయిల్, హమాస్ బుధవారం ధ్రువీకరించాయి. ఖతార్-ఈజిప్టు మధ్యవర్తిత్వం ఫలించింది. 46రోజుల హింసకు తాత్కాలిక విరామం లభించింది. నాలుగు రోజుల కాల్పుల విరమణపై ఇజ్రాయిల్‌తో ఏకాభిప్రాయం కుదిరినట్లు హమాస్ ప్రకటించింది. గురువారం నుంచి కాల్పుల విరమణ అమల్లోకి రానున్నట్లు తెలిసింది.

2లో

జగన్ బెయిల్ రద్దుపై సుప్రీంలో రేపు విచారణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బెయిల్ రద్దు కోరుతూ వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 24న సుప్రీంకోర్టు విచారణ చేపట్టనున్నది. అక్రమాస్తుల కేసులో పదేళ్లుగా జగన్ బెయిల్‌పై ఉన్నారని, కేసులపై విచారణ వేగవంతం చేయాలని గతంలో తెలంగాణ హైకోర్టులో రఘురామ కృష్ణరాజు పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై తెలంగాణ హైకోర్టులో సీబీఐ కౌంటర్ దాఖలు చేసింది. అనంతరం రఘురామ పిటిషన్‌ను కొట్టివేస్తూ ఉన్నత న్యాయస్థానం తుది ఉత్తర్వులు ఇచ్చింది. హైకోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టులో రఘురామ సవాల్ చేశారు. ఈ క్రమంలో జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా ధర్మాసనం శుక్రవారం జరిపే విచారణ జాబితాలో రఘురామ పిటిషన్‌ను చేర్చింది. పిటిషన్‌పై జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా, జస్టిస్ పంకజ్ మిత్తల్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

ఇజ్రాయిల్-హమాస్ పోరు

ప్రాంతీయ ఘర్షణ కారాదు

- ఉగ్రవాదం ఆక్షేపణీయం
- పౌర హత్యలు ఖండనార్హం
- జీ20 వర్చువల్ సదస్సులో మోదీ



న్యూదిల్లీ: ఉగ్రవాదం ఎట్టిపరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదని, పౌరహత్యలు ఎక్కడ జరిగినా తీవ్రంగా ఖండించాల్సినదేనని ప్రధాని నరేంద్రమోదీ నొక్కి చెప్పారు. పశ్చిమాసియాలో అనిశ్చితిపై ఆందోళన వ్యక్తంచేశారు. ఇజ్రాయిల్-హమాస్ మధ్య పోరు... ప్రాంతీయ ఘర్షణగా మారరాదని అన్నారు. బందీల విడుదలకు ఒప్పందాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. బందీలంతా త్వరగా విడుదల కావాలని ఆకాంక్షించారు. మోదీ బుధవారం జీ20 వర్చువల్ సదస్సులో మాట్లాడుతూ పశ్చిమాసియాలో అభద్రతా, అనిశ్చితి నెలకొనడం ఆందోళన కలిగిస్తోందని, ఆ ప్రాంతానికి కొత్త సవాళ్లు చుట్టుముడుతున్నాయన్నారు. అన్ని సమస్యల పరిష్కారానికి మనమంతా కలిసి ఉన్నామని చెప్పేందుకు ఈ సదస్సే నిదర్శనమని చెప్పారు. మానవతా సాయం సకాలంలో, నిర్విరామంగా అందించడం అత్యవసరమని అన్నారు. ఇజ్రాయిల్-హమాస్ మధ్య పోరు ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రాంతీయ ఘర్షణకు దారి తీయకుండా చూసుకోవడం ఎంతో అవసరమన్నారు. తమ అధ్యక్షతన ఆఫ్రికాకు జీ20 సభ్యత్వం లభించడం భారత్‌కు గర్వకారణమన్నారు. గత ఏడాది కాలంగా గ్లోబల్ సౌత్ గళం జీ20 వేదిగా వినిపించిందని అన్నారు. బహుపాక్షికత్వంతో విశ్వాసాన్ని పెంచడమే కాకుండా ప్రపంచ పాలన సంస్కరణలకు జీ20 ద్వారా మార్గదర్శకత్వం లభించినట్లు మోదీ తెలిపారు. మనమంతా కలిసి జీ20ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లాం. అపనమ్మకం, సవాళ్లతో నిండివున్న ఈ ప్రపంచంలో మనకు ఒకరిపై ఒకరికి ఉన్న నమ్మకమే కలిసి ముందు కెళ్లేందుకు ధైర్యమిస్తుంది. వివాదాలను పక్కకుపెట్టి ఐక్యంగా, పరస్పరం సహకరించుకుంటూ పని చేశాం' అని మోదీ అన్నారు. జీ20లోకి ఆఫ్రికాను భారత్ స్వాగతించడాన్ని మరువలేనన్నారు. జీ20 తీర్మానం అమలు తీరుతెన్నులను సమీక్షించంతో పాటు అనేక అంశాలపై చర్చించేందుకు ఈ సదస్సును భారత్ నిర్వహించింది. అయితే ఆరు వారాల తర్వాత గాజాలో తాత్కాలిక కాల్పుల విరమణకు ఒప్పందం జరిగిన తరుణంలో ఈ

- మిగతా 2 లో

4 రోజులు కాల్పుల విరమణ

- బందీల విడుదలకు ఇజ్రాయిల్, హమాస్ అంగీకారం
- నేటి నుంచి అమలు

జెరూసలేం/గాజా: ఇజ్రాయిల్-హమాస్ మధ్య ఎట్టకేలకు సంధి కుదిరింది. గాజాలో నాలుగు రోజుల కాల్పుల విరమణ, బందీల విడుదలకు, మానవతా సాయాన్ని అనుమతించేందుకు అంగీకరించినట్లు ఇజ్రాయిల్, హమాస్ బుధవారం ధ్రువీకరించాయి. ఖతార్-ఈజిప్టు మధ్యవర్తిత్వం ఫలించింది. 46రోజుల హింసకు తాత్కాలిక విరామం లభించింది. నాలుగు రోజుల కాల్పుల విరమణపై ఇజ్రాయిల్‌తో ఏకాభిప్రాయం కుదిరినట్లు హమాస్ ప్రకటించింది. గురువారం నుంచి కాల్పుల విరమణ అమల్లోకి రానున్నట్లు తెలిసింది. కాగా 50 మంది పిల్లలు, మహిళలను హమాస్ విడుదల చేస్తే... ఇజ్రాయిల్ తమ జైళ్లలో మగ్గుతున్న 150 మంది పలస్తీనా యువకులు, పురుషులను విడుదల చేస్తుంది. కాల్పుల విరమణ అమల్లో ఉంటే నాలుగు రోజులలో బందీలను చిన్న చిన్న బృందాలుగా విడుదల చేస్తారు. అదనంగా విడుదల చేసే ప్రతి 10 మంది బందీలకు బదులుగా కాల్పుల విరమణ ఒక రోజు పొడిగిస్తారు. ఈ మేరకు నెతన్యాహు కార్యాలయం ఓ ప్రకటన చేసింది. ఒప్పంద కాలంలో గాజాలో దాడులుగానీ అరెస్టులుగానీ జరగబోవని ఇజ్రాయిల్ పేర్కొంది. ఒప్పందం ఎప్పటినుంచి అమలవుతుందో 24 గంటల్లో ప్రకటిస్తామని ఖతార్ ప్రభుత్వ ప్రకటన తెలిపింది. నెతన్యాహు మాత్రం తమ మిషన్‌లో ఎలాంటి మార్పు లేదని ప్రకటన చేశారు. 'మా లక్ష్యం నెరవేరేంత వరకు యుద్ధాం ఆగదు. హమాస్‌ను అంతం చేసితీరుత్తాం. బందీలందరినీ సురక్షితంగా ఇళ్లకు చేరుస్తాం. ఇజ్రాయిల్ జోలికి రాగలిగేలా గాజాలో ఎవరూ ఉండకుండా చేస్తాం' అని ఉద్ఘాటించారు. సంధికి అంగీకరించామేగానీ ట్రిగర్‌పై నుంచి చేయి తొలగించలేదని హమాస్ కూడా ప్రకటన చేసింది. 'సంధికి అంగీకరించాం కానీ మా వేళ్లు ఎప్పుడు ట్రిగర్‌పైనే ఉంటాయి. మా వాళ్లను రక్షించుకుంటాం. మా యోధులు ఎప్పుడు అప్రమత్తంగా ఉంటారు. దురాక్రమణకు అంతం పలుకుతాం' అని పేర్కొంది. హమాస్ వద్ద 200 మంది బందీలుగా ఉన్నట్లు ఇజ్రాయిల్ చెబుతోంది. అయితే ఇప్పటివరకు నలుగురు బందీలను హమాస్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

14వేలకు పెరిగిన మృతులు

వీరిలో 5,840 మంది పిల్లలు

ఇజ్రాయిల్, హమాస్ మధ్య పోరులో చనిపోయిన వారి సంఖ్య 14వేలను దాటింది. మృతుల్లో 5,840 మంది పిల్లలు, 3,920 మంది మహిళలు ఉన్నారని మీడియా కార్యాలయ డైరెక్టర్ జనరల్ ఇస్మాయిల్ అల్ తవాబ్తా వెల్లడించారు. మరో 33వేల మందికిపైగా గాయపడినట్లు తెలిపారు. ఇంకో 6,800 మంది జాడలేరని ఆయన విలేకరులతో చెప్పారు.

లెబనాన్‌లో జర్నలిస్టులపై దాడులు బాధాకరం: యూనిఫిల్

బీరుట్: దక్షిణ లెబనాన్‌లో జర్నలిస్టులు, పౌరులే లక్ష్యంగా ఇజ్రాయిల్ దాడులు చేస్తుండటాన్ని లెబనాన్‌లోని ది యునైటెడ్ నేషన్స్ ఇంటరిమ్ ఫోర్స్ (యూనిఫిల్) తీవ్రంగా ఖండించింది. ఉద్దేశ పూర్వకంగా దాడులు చేయడం అంతర్జాతీయ చట్టాల అతిక్రమణ, యుద్ధనేరమని యూనిఫిల్ అధికార ప్రతినిధి ఆం డ్రియా టెనెటి తెలిపారు.

జర్నలిస్టులు, పౌరుల భద్రతకు అన్ని వర్గాలు ప్రాధా న్యత ఇవ్వాలని, వారి ప్రాణాలు ముప్పు కలిగే ప్రాంతాల్లో దాడులను నివారిం చాలని సూచించారు. దక్షిణ లెబనాన్‌లో జర్నలిస్టుల బృందంపై దాడి కలచివేసిందంటూ బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు.

ఇజ్రాయిల్‌తో దక్షిణాఫ్రికా తెగతెంపులు

ఎంబసీ మూసివేతకు పార్లమెంటు ఆమోదం

కేప్‌టౌన్: ఇజ్రాయిల్‌తో తెగతెంపులు చేసుకుందుకు దక్షిణాఫ్రికా సిద్ధమైంది. దౌత్య సంబంధాలను తెంచుకోవాలని నిర్ణయించింది. ప్రిటోరియాలోని ఇజ్రాయిల్ దౌత్యకార్యాలయాన్ని మూసివేసేందుకు దక్షిణాఫ్రికా పార్లమెంటు ఆమోదించింది. దిగువ సభలో దీనిపై ఓటింగ్ జరుపగా 248 మంది సభ్యుల్లో 91 మంది మినహా అంతా అనుకూలంగా ఓటేశారు. విపక్ష పార్టీ ఎకనామిక్ ఫ్రీడమ్‌ఫైటర్స్ సభ ముందు ఈ ప్రతిపాన ఉంచగా అధికార ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ మద్దతిచ్చింది. దక్షిణాఫ్రికా రాయబారి ఎలివ్ బెలోట్సర్‌కోవిస్కీని ఇజ్రాయిల్ రీకాల్ చేసిన క్రమంలో తాజా పరిణామం చోటుచేసుకుంది.

ఆస్ట్రేలియాలో 400 మందితో పలస్తీనా ఆందోళన

సిడ్నీ: గాజాలో కాల్పుల విరమణకు డిమాండ్ చేస్తూ ఆస్ట్రేలియాలో 400 మందికిపైగా పలస్తీనాకు అనుకూలంగా ఆందోళన చేశారు. రాజధాని సిడ్నీ శివార్లలో మంగళవారం రాత్రి జరిగిన నిరసనలో 23 మంది అరెస్టుకు గురయ్యారు. పోర్టు బొటానీ వద్ద అనధికారికంగా నిరసనను 400 మంది చేపట్టారని, ఫోర్‌షోర్ రోడ్డును దిగ్బంధించారని ఎన్ఎస్‌డబ్ల్యూ పోలీసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల ఆదేశాలను ధిక్కరించినందుకు 23 మందిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. గాజాలో దాడులకు ఇజ్రాయిల్‌కు మద్దతిచ్చిన ఆదేశానికి చెందిన షిప్పింగ్ కంపెనీ జిమ్ వద్ద వందలాది మంది ఆందోళనకు దిగినట్లు సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ నివేదించింది.

'దివైర్' ఎడిటర్ అర్ఫా ఖానూమ్ షేర్వానికి 'ఛత్రపతి సమ్మాన్'

(మొదటిపేజీ తరువాయి)

చర్యను ప్రశ్నించడాన్ని సహించలేని స్థితికి చేరుకున్నారు. ఉగ్రవాద కార్యకలాపాల వ్యతిరేక చట్టాల కింద కేసుల్లో ఇరికించి ప్రాతికేయులపై చర్యలు తీసుకునే దుస్థితి నెలకొంది. వారసత్వ మీడియా అంతంతో ప్రత్యామ్నాయ మీడియా గత దశాబ్ద కాలంలో ఆవిర్భవించింది. ఇది ప్రజాస్వామ్యానికి శుభవార్త. ప్రతికూల పరిస్థితులు, పరిమిత వనరులు ఉన్నాగానీ ది వైర్ వంటి మాధ్యమాలు ప్రజలకు తమ హక్కుల గురించి పూర్తి అవగాహన కల్పిస్తున్నాయి. సత్యం, ప్రజాస్వామ్యం కోసం పోరాటాలు జరుగుతాయనేందుకు షహీన్ బాగ్, కిసాన్ ఆందోళన్ వంటి ప్రజా ఉద్యమాలే నిదర్శనం' అని అర్ఫా అన్నారు. అధికారంలో ఉన్న వారు, వారి మద్దతుదారులు తనను ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో వేధించారని, తన మతాన్ని దూషించారని, జర్నలిస్టుగా చేసే పనిని అవమానించారని, అత్యాచారం చేస్తామని, ప్రాణాలు తీస్తామని బెదిరించారని ఆమె చెప్పారు. సామాన్య ప్రేక్షకులే తనకు కొండంత బలమని, అందుకే ఎలాంటి బెదిరింపులకు తలొగ్గలేదని అర్ఫా తెలిపారు. రామ్ చందర్ ఛత్రపతి వలే జర్నలిస్టు హత్యకు గురి కాకముందే వారికి మద్దతివ్వాలని పిలుపునిచ్చారు. కాగా హరియాణాలోని సిర్సా నుంచి ప్రచురితమయ్యే పూరా సచ్ సంపాదకులు రామ్ చందర్ ఛత్రపతి 2002, అక్టోబరు 24న హత్యకు గురయ్యారు. డేరా సచ్చాసౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీం సింగ్ గుట్టు విప్పి, చివరి వరకు నిర్భయంగా కథనాలు వెలువరించారు. ధైర్యంగా, నిష్పాక్షికంగా జరల్నిస్టు వృత్తికి న్యాయం చేశారు. ఆయన వలే నిస్వార్థ సేవలు అందించే పాత్రికేయులను రామ్ చందర్ ఛత్రపతి జర్నలిజం అవార్డులతో రామ్‌చందర్ కుటుంబం సన్మానిస్తోంది.

పంజాబ్, హరియాణాలో ఎన్ఐఏ సోదాలు

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన దాడుల వెనుక కుట్రను బహిర్గతం చేసేందుకు సోదాలు జరిపినట్లు ఎన్ఐఏ అధికార ప్రతినిధి తెలిపారు. పంజాబ్‌లోని మోగా, జలంధర్, లూధియానా, గురుదాస్‌పూర్, మొహాలీ, పాటియాలా, హరియాణాలోని కురుక్షేత్ర, యమునానగర్ జిల్లాల్లో సోదాలు జరిపినట్లు వెల్లడించారు. నిందితుల సమాచారంతో డిజిటల్ డేటాతో పాటు నేరపూరిత పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దోషులను గుర్తించడమే కాకుండా వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా భారత విద్రోహ శక్తులకు గట్టి హెచ్చరిక చేయాలన్న ఉద్దేశంతో ఈ కేసును ఎన్ఐఏ విచారిస్తోంది. కాన్సులేట్‌పై దాడులను విచారించేందుకు ఎన్ఐఏ బృందం ఆగస్టులో శాన్‌ఫ్రాన్సిస్కోను సందర్శించింది. కాగా పరస్పర న్యాయ సహకార ఒప్పందం ప్రకారం అమెరికా అధికారుల నుంచి దాడికి సంబంధించిన ఆధారాలను ఈనెల 14వ తేదీన ఎన్ఐఏ కోరినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

9 జిల్లాలకు భారీ వర్ష సూచన

(మొదటిపేజీ తరువాయి)

చెదురుమదురు వర్షాలు కురిశాయి. కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య రాయచోటి, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవగా, తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో మంగళవారం నుంచే భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పర్యటన సైతం వాయిదా పడింది. గురువారం రాష్ట్రవ్యాప్తంగా దాదాపుగా అన్ని జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడుతుందని ఐఎండీ, ఏపీ ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ సంస్థ తెలియజేశాయి. మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించాయి.

ప్రాంతీయ ఘర్షణ కారాదు

(మొదటిపేజీ తరువాయి)

సదస్సు జరగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. సదస్సులో యూరోపియన్ యూనియన్ అధ్యక్షులు ఉర్సులా వోన్ డెర్ లేయన్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడ్యూ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, ఐఎంఎఫ్ ఎండీ క్రిస్టాలినా జార్జివా తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

వైద్యవిద్యా శాఖ ఉన్నతాధికారుల హామీ

విశాలాంధ్ర-విజయవాడ: వైద్యవిద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని వైద్యవిద్యా శాఖ ఉన్నతాధికారులు హామీఇచ్చారు. విజయవాడ వైద్యవిద్య సంచాలకుడి కార్యాలయంలో శాఖ అదనపు డైరెక్టర్ డాక్టర్ రఘునందన్, డిప్యూటీ డైరెక్టర్ కర్రి అప్పారావు (అడ్మిన్)తో ఉద్యోగుల యూనియన్ నాయకులు సమావేశమయ్యారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.బాలయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏటుకూరి గిరిబాబు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సమావేశాన్ని ఏర్పాటు చేసినందుకు అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అదనపు ఫార్మసిస్ట్ గ్రేడ్-1 ఫార్మసీ సూపర్‌వైజర్, లాబ్ టెక్నీషియన్ గ్రేడ్-1, ల్యాబ్ సూపర్‌వైజర్, చీఫ్ రేడియో గ్రాఫర్ పోస్టులను మంజూరు చేయాలని, ఫార్మసీ వారికి ఆరోగ్యశ్రీ స్టాఫ్ ఇన్సెంటీవ్ చెల్లించే జీవోలు సవరించాలని కోరారు. అధికారులు స్పందిస్తూ అర్హతల ఆధారంగా పదోన్నతులు కల్పిస్తామని తెలిపారు. నాన్ మెడికల్ అసిస్టెంట్ గెజిటెడ్, బయో కెమిస్ట్రీ (గెజిటెడ్)కు నోటిఫికేషన్ ఇస్తామని హామీ ఇచ్చారు. లైబ్రేరియన్ డైటీసీఎన్ పదోన్నతులు పరిశీలిస్తామన్నారు. ఇతర అంశాలపై చర్చించి త్వరలో ఆదేశాలు ఇస్తామని అధికారులు తెలిపారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులను 114 జీవో ప్రకారం క్రమబద్ధీకరించాలన్నారు. సమావేశంలో యూనియన్ నేతలు బి.స్వామి బాబు, ఎం. బాలరాజు నాయుడు, లక్ష్మణమూర్తి, ఎస్వీ వైద్య కళాశాల శాఖాధ్యక్షుడు వీరకిరణ్ పాల్గొన్నారు.

పేదల భూములకు పూర్తి హక్కులు కల్పించాలి

సీఎం జగన్‌కు ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: ఇప్పటికే పేదల స్వాధీనంలో ఉన్న భూములకు పూర్తి హక్కులు కల్పించాలని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని కోరింది. ఈ మేరకు బుధవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, ఉప ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రావ్ సీఎంకు లేఖ రాశారు. కోనేరు రంగారావు భూకమిటీ చేసిన, ప్రభుత్వం ఆమోదించిన సిఫార్సులను ప్రాతిపదికగా చేసుకొని పట్టాలివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 80 వేల ఎకరాలు గుర్తించామంటున్న ప్రభుత్వం మిగిలిన లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూముల సంగతిపై కూడా దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం చేపట్టిన భూ పంపిణీ అనేదానికి అర్థం కల్పించాలంటే వైసీపీ ప్రభుత్వం కొత్తగా భూ పంపిణీ చేయాలని సూచించారు. పేదవాడి చేతిలో ఉన్న భూమి కాగితాలు మార్చినంత మాత్రాన ఉపయోగం ఉండదన్నారు. చాలామంది పేదల చేతుల్లో భూములు సాగులో ఉన్నప్పటికీ వారికి ఇప్పటివరకు పట్టాలు ఇచ్చిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. ఇటీవల ఏలూరు జిల్లా నూజివీడులో పేదలకు భూ పంపిణీ కార్యక్రమంలో సంపూర్ణ హక్కులతో అనుభవించుకోవచ్చని పట్టాలు కూడా ఇచ్చారని, అయితే అవన్నీ కూడా గత ప్రభుత్వాలు ఇచ్చి భూములకే ప్రకటించటం జరిగిందన్నారు. తద్వారా కొత్తగా పేదలకు ఎక్కడా న్యాయం జరగలేదన్నారు. ఇంతకుముందే అసైన్ పట్టాలు పొందిన వారికే సంపూర్ణ హక్కులు కల్పించారని తెలిపారు. అనర్హుల చేతుల్లో ఉన్న అసైన్డ్ భూములను తీసుకొని అర్హులైన పేదవారికి తిరిగి పట్టాలు ఇవ్వాలని కోరారు. దాదాపు రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల ఎకరాల భూములు అనర్హుల చేతిలోకి వెళ్లాయన్నారు. అసైన్డ్ భూములు పెత్తందారులు, భూస్వాముల చేతిలోకి వెళ్లకుండా కాపాడటానికి అసైన్ చట్టం ఉన్నప్పటికీ పేదల దగ్గర ఉన్న అసైన్డ్ భూములన్నీ తక్కువ ధరలకు తీసేసుకుంటున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా 22ఏ సవరణ చేయడం ద్వారా చాలామంది పేదలు ఆసైన్డ్ భూములకు దూరమై నష్టపోతున్నారని వివరించారు. డబ్బున్న పెత్తందారులు, భూస్వాములకే అసైన్డ్ భూములు పొందడానికి అవకాశం ఉంటుందని, ఫలితంగా పూర్తిగా పేదలు అన్యాయమైపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. జగనన్న శాశ్వత భూహక్కు సర్వే ద్వారా కూడా సర్వే చేసినప్పటికీ అసైన్డ్ భూములు పేదల అనుభవంలో ఉన్నప్పటికీ వారికి హక్కులు కల్పించడం లేదని అన్నారు. అసలు వైసీపీ ప్రభుత్వం కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను పరిగణనలోకి తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నియమించిన కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు పక్కాగా అమలు చేస్తే ప్రతి పేదవాడికి ప్రభుత్వ భూములు ఇవ్వడానికి అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. అసైన్డ్ భూముల చట్ట సవరణను తిరిగి పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే చాలామంది పేదల సాగులో ఉన్న ప్రభుత్వ భూములకు రెవెన్యూ శాఖ సక్రమంగా భూ రికార్డుల్లో నమోదు చేయటం లేదని పేర్కొన్నారు. అడవిబిడ్డలు, గిరిజన బిడ్డలు సాగు చేసుకుంటున్న అటవీ భూములకు సక్రమంగా హక్కులు కల్పించకుండా వారిని ఆ భూముల నుంచి వెళ్లగొడుతున్నారని తెలిపారు. వారికి రక్షణగా ఉన్న అటవీ హక్కుల సంరక్షణ చట్టం పక్కాగా అమలు చేసి వారికి కూడా న్యాయం చేయాలని కోరారు. వాటన్నిటిపై జోక్యం చేసుకొని, సరిదిద్ది పేదలకు న్యాయం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం తరపున విజ్ఞప్తి చేశారు.

పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలి

(మొదటిపేజీ తరువాయి)

చెల్లించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ ధర్నా చౌక్ వద్ద రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టర్లు నిరసన ధర్నా చేపట్టారు. ఈ సభకు అధ్యక్షులుగా ఎస్ఏబీసీఏ రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఎం.ఆర్‌డి.ప్రసాద్ వ్యవహరించారు. ఈ సందర్భంగా బిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు చిన్నం రామకోటయ్య మాట్లాడుతూ కాంట్రాక్టర్లు బిల్లులు రాక చాలా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని అన్నారు. బడ్జెట్‌లో చెప్పిన పనులు చేసిన వాటికే డబ్బులు అడుగుతున్నామన్నారు. కాంట్రాక్టర్లకు ఈ నాలుగున్నర సంవత్సరాలు ఓ కనువిప్పు వంటిందని తెలిపారు. కాంట్రాక్టర్‌లు ఎక్కడో ఒక చోట అప్పు చేసి పనులు చేస్తారని, ఆ బిల్లులు రాకపోవడంతో సకాలంలో రుణాలు చెల్లించకపోవడంతో బ్యాంక్‌లు కూడా రుణాలు ఇవ్వటం మానేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్‌లు రాష్ట్రంలో దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో తీసుకున్న చైర్‌లకు కూడా డబ్బులు ఇవ్వలేని పరిస్థితికి ఈ రాష్ట్ర ప్రభుత్వం చేరిందన్నారు. తాము వెళితే అధికారులు కనీసం కూర్చో అని చెప్పకుండా అవమానిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మాకు అప్పు ఉన్న విషయం మరచిపోతోందని అన్నారు. గ్రామ సర్పంచ్‌లు తమ పేర్లపై కాంట్రాక్ట్‌లు చేసి ఇల్లు, పొలాలు అమ్ముకొన్నారని తెలిపారు. మిమ్మల్ని దేహి అని అడగడం లేదు. మా డబ్బు మాకు ఇవ్వాలంటున్నాం. మా పూర్వీకులు ఇచ్చిన ఆస్తులు అమ్ముకుంటున్నాం. మా డబ్బులు ఇవ్వాలని హైకోర్టు చెప్పినా వినడం లేదు. సీసీ రోడ్ల పనులు చేసిన కాంట్రాక్టర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. చివరకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న చెల్లింపు మొత్తాలను కూడా ఈ ప్రభుత్వం ఇవ్వడం లేదు. నిన్న సమ్మె చేస్తాం అంటే 100 కోట్లు ఇచ్చారు. డబ్బులు వచ్చాయి కదా అని అప్పులు ఇచ్చిన వాళ్లు ఇంటికి వచ్చి కూర్చుంటున్నారు. రూ.20 వేల కోట్లకు 100 కోట్లు చెల్లిస్తే అవి ఏ మూలకు వస్తాయి అని ప్రశ్నించారు. 15 రోజులలో అందరికీ వినతి పత్రాలు ఇస్తామని, అన్ని సంఘాలను కలుపుకుని రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ చేపడతామని తెలిపారు. ఆందోళన చేపట్టిన కాంట్రాక్టర్లకు అమరావతి నాయకులు వెలగపూడి గోపాలకృష్ణ, పోతుల బాలకోటయ్య, రైతు సంఘం నాయకురాలు ఝాన్సీలక్ష్మి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో బాయ్ రాష్ట్ర చైర్మన్ రాఘవరావు, ఎస్ఏడీసీఏ రాష్ట్ర చైర్మన్ శివకుమార్, వల్లభనేని వెంకటేశ్వరరావు, కాశి, సంఘాల ప్రతినిధులు ఎన్.నాగేశ్వరరావు, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తేలని పంచాయితీ

(మొదటిపేజీ తరువాయి)

ఆమోదం తెలపడం ఆంధ్రప్రదేశ్ ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసిందని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం 2014 జులై 14న చేసిన ఫిర్యాదు ప్రకారం ఈ విధివిధానాలను కేవలం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకే పరిమితం చేశారని గుర్తు చేశారు. ఆ విధివిధానాల నుంచి కృష్ణా నదీ పరివాహక ప్రాంతం(బేసిన్)లోని మిగతా రెండు రాష్ట్రాలను (మహా రాష్ట్ర, కర్నాటక) పూర్తిగా మినహాయించి... రెండు రాష్ట్రాలకే (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ) పరిమితం చేయాలని ఏకపక్షంగా సూచించడం అశాస్త్రీయమని చెప్పారు. దీంతో పాటు జాతీయ సంపద అయిన జల వనరులను న్యాయబద్ధంగా వినియోగించుకోవడం కూడా విరుద్ధమని స్పష్టం చేశారు. కేంద్రమంత్రివర్గం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల కృష్ణా జలాలపై ఆధారపడిన ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రయోజనాలకు విఘాతం కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయపరమైన చిక్కులు పరిశీలించి, ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలు తీసుకోకుండా కేంద్ర జలశక్తి శాఖను ఆదేశించాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. దానిపై నెలన్నర రోజులు దాటినా ఇంతవరకు పరిష్కరించే దిశగా కేంద్రం ప్రయత్నాలు సాగడం లేదు. ఇప్పుడు ఏకంగా విచారణను కృష్ణా ట్రిబ్యునల్ మరో రెండు నెలలపాటు వాయిదా వేసింది.

ఐఎస్ఆర్‌డబ్ల్యూడీ చట్టం-1956లో సెక్షన్-4 ప్రకారం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-1 (కేడబ్ల్యూడీటీ - కృష్ణా వాటర్ డిస్‌పూట్ ట్రిబ్యునల్)ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కేడబ్ల్యూడీటీ-1 ఇచ్చిన తుది నివేదిక ఆధారంగా 1976 మే 31న గెజిట్‌ను ప్రచురించింది. కృష్ణా నదిలో 2,130 టీఎంసీల జలాలు అందుబాటులో ఉన్నాయని కేడబ్ల్యూడీటీ-1 లెక్క కట్టింది. కృష్ణాలో 75 శాతం నీటి లభ్యత ఆధారంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 811 టీఎంసీలు కేటాయించింది. 2,130 టీఎంసీల కన్నా అధికంగా ఉన్న జలాలు అంటే మిగులు జలాలను వినియోగించుకునే స్వేచ్ఛను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చింది. ఐఎస్ఆర్‌డబ్ల్యూడీ చట్టం-1956లో సెక్షన్-6(1) ప్రకారం కేడబ్ల్యూడీటీ-1 అవార్డు సుప్రీంకోర్టు డిక్రీతో సమానం. కృష్ణా బేసిన్‌లోని రాష్ట్రాలకు సగటు ప్రవాహాలతో సహా 65 శాతం లభ్యత ఆధారంగా అదనపు నీటిని కూడా కేటాయించింది. దీని కింద ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 194 టీఎంసీలు కేటాయించింది. దాంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చేసిన మొత్తం కేటాయింపులు 1005 టీఎంసీలు (811 టీఎంసీలు,194 టీఎంసీలు). దీంతోపాటు 2,578 టీఎంసీల కంటే ఎక్కువగా ఉండే అదనపు ప్రవాహాలను ఉపయోగించుకోవడానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు స్వేచ్ఛ ఇచ్చింది. అనంతరం కృష్ణా జలాల పంపిణీకి ఐఎస్ఆర్‌డబ్ల్యూడీ చట్టం-1956లోని సెక్షన్- 4 (1) ప్రకారం 2004 ఏప్రిల్ 2న కేడబ్ల్యూడీటీ-2 (బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్)ని కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ట్రిబ్యునల్ 2010 డిసెంబర్ 30న సెక్షన్-5(2) ప్రకారం నివేదిక సమర్పించింది. ఆ తర్వాత 2013 నవంబర్ 29న సెక్షన్ 5(3) ప్రకారం కేడబ్ల్యూడీటీ-1 ద్వారా అప్పటికే 75 శాతం లభ్యత ఆధారంగా చేసిన 2,130 టీఎంసీల కేటాయింపులను నిర్ధారిస్తూ కేడబ్ల్యూడీటీ-2 తదుపరి నివేదిక సమర్పించింది. కేడబ్ల్యూడీటీ-2 నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో ఐదు ఎస్సెల్పీ (స్పెషల్ లీవ్ పిటిషన్)లను కృష్ణా బేసిన్‌లోని రాష్ట్ర ప్రభుత్వాలు దాఖలు చేశాయి. సెక్షన్ 5(2) ప్రకారం కేడబ్ల్యూడీట-2 ఇచ్చిన నివేదికను పక్కన పెట్టాలంటూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టును అభ్యర్థించింది. సుప్రీంకోర్టు 2011 సెప్టెంబరు 16న జారీ చేసిన ఉత్తర్వుల ద్వారా కేడబ్ల్యూడీటీ-2 సెక్షన్-5(2) కింద ఇచ్చిన నివేదికపై స్టే ఇచ్చింది. ఈ ఎస్సెల్పీలన్నీ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉండగా, ఇదే అంశాన్ని 2021 ఆగస్టు 17న, ఆ తర్వాత 2022 జూన్ 25న కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి దృష్టికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకెళ్లింది. ట్రిబ్యునల్ ద్వారా జరిగిన కేటాయింపులకు ఎలాంటి భంగం వాటిల్లకుండా న్యాయ బద్ధమైన నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఈ వివాదాలన్నీ ఇలా ఉండగానే, కృష్ణా జలాల పున:పంపిణీపై కేంద్రం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ మరో వివాదానికి దారి తీసింది.

చంద్రబాబుకు బెయిల్ రద్దు చేయమని కోరగలరా?

పురందేశ్వరికి విజయసాయి రెడ్డి సవాల్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని కోరగలరా? అని బీజేపీ నేత పురందేశ్వరిని వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయి రెడ్డి ప్రశ్నించారు. ఆయన బుధవారం వివిధ అంశాలపై సామాజిక మాధ్యమం ద్వారా స్పందించారు. దోచుకున్న దాంట్లో తనకు వాటా ఇచ్చే చంద్రబాబుకు బెయిల్ వచ్చిందన్న ఆనందంలో పురందేశ్వరి ఉన్నారన్నారు. లేదంటే చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయగలరా అని సవాల్ చేశారు. చంద్రబాబు బెయిల్‌కి హామీ లేనప్పుడు ఆయన ప్రజల భవిష్యత్తుకు ఎలా హామీ ఇస్తారని ప్రశ్నించారు. బాబు వస్తే ఇంటింటికీ లక్షలు వచ్చి పడతాయని టీడీపీ నేతలు ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, 14 ఏళ్లు సీఎంగా ఉండి ఆయన ప్రజలకు చేసిందేమిటని నిలదీశారు. ప్రభుత్వాసుపత్రుల్లో గుండె చికిత్సకు సంబంధించి అత్యాధునిక వైద్య సదుపాయాలను జగన్ ప్రభుత్వం కల్పిస్తోందని విజయసాయి రెడ్డి తెలిపారు.

విలీనం...నయవంచన

(మొదటిపేజీ తరువాయి)

లేదని ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈహెచ్ఎస్ కార్డు కేవలం ఓపీకి మాత్రమే పనికి వస్తుందని, ఆపరేషన్లకు మాత్రం పనిచేయడం లేదని...ఆరోగ్యశ్రీ కార్డు మీద వచ్చే ప్రయోజనాలు కూడా రావడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఇటీవల ఏలూరు జిల్లాలో ఒక ఆర్టీసీ ఉద్యోగి తీవ్ర అనారోగ్యం పాలై ఆసుపత్రికి వెళ్లాడు. అతనికి వైద్యం నిమిత్తం ఎంప్లాయిస్ హెల్త్ కార్డు (ఈహెచ్ఎస్) కింద వైద్యం అందించలేమని సిబ్బంది తేల్చి చెప్పారు. ఆర్టీసీ కార్పొరేషన్ ఉన్నప్పుడు ఆ ఖర్చంతా ఆర్టీసీనే భరించి వైద్యం అందించేవారు. ఇప్పుడు ప్రభుత్వం ఇచ్చిన ఈహెచ్‌సీ వైద్యానికి పనికి రాకుండా పోయింది. వైద్య పరీక్షలన్నీ సొంత ఖర్చులతోనే చేయించుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎస్ఆర్‌బీసీ కింద ప్రతినెలా ఉద్యోగులు రూ.300 పొదుపు చేసుకుని దాని ద్వారా పిల్లల చదువులకు రుణాలు, రిటైర్ అయిన ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ కల్పించేవారు. ఇప్పుడు ఈ పథకాన్ని కూడా ప్రభుత్వం రద్దు చేయడంతో రిటైర్ అయిన ఉద్యోగులకు గతంలో వచ్చే రూ.3,4 వేల పెన్షన్ కూడా పోయిందంటున్నారు. రిటైరైన ఉద్యోగులకు ఎలాంటి భద్రతా లేకపోవడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగి కావడంతో అతనికి సామాజిక భద్రత పెన్షన్ కూడా వచ్చే అవకాశం లేదు. దీంతో ఆర్టీసీ ఉద్యోగుల్లో ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. విలీనం పేరుతో ప్రభుత్వం తమని వంచిందని ఉద్యోగులు మండిపడుతున్నారు.

పాత పింఛనుపై ఆశలు ఆవిరి

ప్రభుత్వంలో విలీనం కావడంతో తమకు ఇతర శాఖల ఉద్యోగుల మాదిరిగా పాత పింఛన్ అందుతుందని ఎదురుచూస్తున్న ప్రజా రవాణా విభాగం (పీటీడీ) సిబ్బంది ఆశలు ఆవిరి చేస్తూ పిటీడీ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం వీరికి అమలులో ఉన్న ఈపీఎఫ్ పింఛనులో కొనసాగుతారా, సీపీఎస్‌లో చేరడం ద్వారా గ్యారంటీ పింఛను పథకం పొందుతారా అనేది ఆప్షన్ ద్వారా తెలియజేయాలంటూ ఈనెల 20వ తేదీన సర్క్యులర్ జారీ చేసింది. ఇందుకోసం ఈ నెల 27వ తేదీ వరకే గడువిచ్చింది. దీంతో వారిలో ఆందోళన నెలకొంది. ఆర్టీసీ ఉద్యోగులు పాత పింఛను కావాలని కోరుకుంటున్నారు. అసలు విలీనం కోరుకోవడానికి ప్రధాన కారణం కూడా పాత పింఛన్ కోసమే అని ఉద్యోగులు ముక్తకంఠంతో పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులలో 2004 సెప్టెంబర్‌కు ముందు ఉద్యోగం పొందిన వారికి పాత పింఛను అమలులో ఉంది. ఆర్టీసీలోను ఆ సమయానికి విధులలో చేరిన వారికి పాత పింఛను ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఇదేమీ పట్టించుకోకుండా సీపీఎస్‌లో చేరండి, జీపీఎస్ పొందండి అంటూ సర్క్యులర్ జారీ చేయడంపై ఉద్యోగులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేస్తూ గత ఏడాది జూన్ లో ప్రభుత్వం 113 జీవో జారీ చేసింది. అందులో పిటీడీ ఉద్యోగులు ఈపీఎఫ్ లో కొనసాగుతారా, సీపీఎస్ లో చేరతారా అనేది ఆప్షన్ తీసుకోవాలని పీఆర్సీ కమిషనర్ సూచించారు. ఉత్తర్వులలో కూడా ఇదే పేర్కొన్నారు. ఇంతకాలం ఈ అంశాన్ని పట్టించుకోని పిటీడీ యాజమాన్యం ఇప్పుడు సర్క్యులర్ జారీ చేసి 7 రోజులలో ఆప్షన్ తెలపాలంటూ ఎలా ఆదేశిస్తుందని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం తన తీరు మార్చుకొని పిటీడీ ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలని కోరుతున్నారు.

కాలం చెల్లిన బస్సులు

ప్రజా రవాణా శాఖ ఒక బస్సు లక్ష కిలోమీటర్లు తిరిగిన తర్వాత నిలుపుదల చేయాలి. కానీ ప్రభుత్వం కొత్త బస్సులు కొనుగోలు చేయకుండా పాత బస్సులను కొనసాగించడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నాయి. దీనికి డ్రైవర్లని బాధ్యులుగా చేస్తూ చర్యలు తీసుకుంటూ వేధిస్తున్నారు. పల్లె ప్రాంతాలలో నష్టాలను సాకు గా చూపి సర్వీసులను రద్దు చేస్తున్నారు. అద్దె బస్సులను ప్రవేశపెట్టి సిబ్బందిని కుదిస్తున్నారు. సర్వీసుల రద్దుతో మిగిలిన ఉన్న డ్రైవర్లను వేరే డిపోలకు బదిలీ చేసి నూతన నియామకాలు చేపట్టకుండా ఉద్యోగ నియమాకాలలో కోత విధిస్తున్నారు.

ఆర్థికంగా నష్టపోయాం

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల ఉద్యోగులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయారని పిటీడీ పశ్చిమగోదావరి జిల్లా ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు అల్లం నారాయణ తెలిపారు. వేతనాలు ప్రభుత్వ ఉద్యోగులతో సమానం కాకపోగా... కార్పొరేషన్ ద్వారా వచ్చే అనేక ప్రయోజనాలు పోయాయన్నారు. ఈహెచ్ఎస్ హెల్త్ కార్డు ఎందుకు పనికి రావడం లేదున్నారు. విలీనం వల్ల మేలు జరగకపోగా ఉన్న ప్రయోజనాలు కోల్పోవడం బాధాకరమన్నారు.

బీజేపీని ఓడిద్దాం... ప్రజాస్వామ్యాన్ని కాపాడదాం

27, 28న మహాధర్నాలు జయప్రదం చేయండి

కర్షక, కార్మిక, ప్రజాసంఘాల సమన్వయ సమితి నాయకుల పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): మోదీ ప్రభుత్వ కర్షక-కార్మిక-ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 27, 28 తేదీలలో విజయవాడలో జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని, రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పాలని కర్షక-కార్మిక, ప్రజా సంఘాల సమన్వయ సమితి నాయకులు ప్రజలకు పిలుపునిచ్చారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో రైతు, కార్మిక సంఘాల ఐక్య వేదిక సమావేశం రైతుసంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. మోదీ పభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు ఎండగడుతూ రచించిన పుస్తకాన్ని నేతలు ఆవిష్కరించారు.అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజల హక్కులు కాలరాస్తూ, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని, ఉద్యమకారులపై అక్రమ కేసులు బనాయిస్తోందని విమర్శించారు. వ్యవసాయ నల్లచట్టాలు రద్దు కోసం ఉద్యమించి...రైతులు మోదీ మెడలు వంచారని గుర్తుచేశారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ చేతుల్లో పెట్టడానికి కేంద్రప్రభుత్వం పూనుకుంటుందని, ఎప్పటినుండో రైతు సంఘాలు అన్ని పంటలకు కనీస మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని కోరుతున్నప్పటికీ స్పందించకపోవడం అన్యాయమని అన్నారు. కార్మిక, కర్షకులు ఐక్యంగా ఉద్యమాలు నిర్వహించి కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తమ డిమాండ్లు సాధించుకోవాలన్నారు.

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు గడిచిన తరువాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిద్రలేచాయని విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ విభజన హామీలు గుర్తుకు వచ్చాయని, రాష్ట్ర విభజన హామీల గురించి ముఖ్యమంత్రి జగన్ మొక్కుబడి సమీక్ష చేశారన్నారు. కేంద్రాన్ని ప్రశ్నించే ధైర్యం జగన్‌కు లేదన్నారు. కరువుకోరల్లో కూరుకుపోయి రైతాంగం విలవిలలాడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదన్నారు. రాష్ట్రంలో 475 మండలాల్లో కరువు ప్రభావం తీవ్రంగా ఉందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఏడు జిల్లాల్లో 103 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకుందన్నారు. రాష్ట్రంలో అతి తక్కువ వర్షపాతం నమోదైన మండలాలను కరువు మండలాలుగా ప్రకటించకపోవడం దుర్మార్గమన్నారు. రాయలసీమ ప్రాంతాల్లో దుర్భిక్షపరిస్థితులు ఏర్పడ్డాయని, వలసలు అరికట్టాలని, వర్షాభావ పరిస్థితుల వల్ల ఎండిపోయిన పంటలకుగాను రైతులకు పరిహారం చెల్లించాలని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి పనులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం జగన్‌కు, కేంద్ర పెద్దలకు బుద్ధి చెప్పడానికి రెండు రోజుల నిరసన చేపడుతున్నామన్నారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని, దేశ సంపదను ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టే నేషనల్ మానిటైజేషన్‌ను రద్దు చేయాలని, ఖనిజాలు, లోహాల తవ్వకాలకు సంబంధించిన చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేశారు. సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.

అటవీ హక్కుల చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. విశాఖ ఉక్కు కార్మిక నాయకులు సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కును పోస్కో కంపెనీకి కట్టబెట్టేందుకు మోదీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కట్టబెడుతుంటే రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు మౌనం వహించడాన్ని ఆయన ఖండించారు. సమావేశంలో కార్మిక, రైతు, కౌలురైతు సంఘాల నాయకులు సీహెచ్ బాబురావు, దోనేపూడి శంకర్, వై.కేశవరావు, కేవీవీ ప్రసాద్, పి.జమలయ్య, కె.ఉమా మహేశ్వర రావు, కుర్రా నరేంద్ర, వి.కృష్ణయ్య, ముజఫర్ అహ్మద్, ఎం.రామకృష్ణ, ఎ.రవిచంద్ర, పి.దుర్గా భవాని, దయా రమాదేవి, పి.వెంకటసుబ్బయ్య, ఎం.సుబ్బారావు, పి.చంద్రనాయక్, ఎం.హరిబాబు, ఎస్.అనీల్, చిన్నం పెంచలయ్య. ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, కారసాల శ్రీనివాస్, పరుచూరు రాజేంద్ర, యన్.లెనిన్, వి.జాన్సన్‌బాబు, ఆర్‌వీ నరసింహారావు, ఎ.వెంకటేశ్వర రావు, ఎన్‌సీహెచ్ సుప్రజ, ఎ.కమల, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కైలాసగిరి

కొండ దిగువ తవ్వకాలపై హైకోర్టు స్టే

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విశాఖ కైలాసగిరి కొండ దిగువన తవ్వకాలపై హైకోర్టు స్టేటస్ కో ఆదేశాలు ఇచ్చింది. తెన్నేటి పార్క్ పార్కింగ్ కోసం కొండను తవ్వుతున్నట్టు, నిబంధనలకు విరుద్ధంగా కొండను తవ్వి పార్క్ కోసం నిర్మాణం చేపట్టారని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వం అక్రమ నిర్మాణాలు చేపడుతోందని పిటిషనర్ తరపు న్యాయవాది కేఎస్ మూర్తి కోర్టుకు తెలిపారు. దీనిపై కౌంటరు దాఖలు చేయాలని విశాఖ మున్సిపల్ అధికారులకు హైకోర్టు ఆదేశాలిచ్చింది. అప్పటివరకు యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను హైకోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ సహా ఏపీలోని మూడు డిస్కమ్‌ల ఎండీలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. వ్యవసాయ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసే కాంట్రాక్టులో అవకతవకలు జరిగాయని ప్రజా ప్రయోజన వ్యాజ్యం ఆధారంగా కోర్టు నోటీసులు ఇచ్చింది. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌లో అధికారులకు నోటీసులు జారీ చేసింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో అధిక ధరలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారని కోర్టుకు పిటిషనర్ తరపు న్యాయవాది తెలిపారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించడంలేదని మీటర్ల ఏర్పాటుపై స్టే విధించాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరారు. కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ న్యాయవాదికి కోర్టు సూచించింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఆ నివేదిక వివరాలు తెలపండి

ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: చిత్తూరు జిల్లా కుప్పం మండలం నీలుకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కుప్పం మోడల్ స్కూల్‌లో ఘటనలపై సమగ్ర నివేదిక వివరాలు వెల్లడించాలని ఆంధ్రప్రదేశ్ పేరెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఏపీ పాఠశాల విద్యా ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌కు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.నరహరి బుధవారం లేఖ రాశారు. బాధ్యులైన ఉపాధ్యాయులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కూడా డిమాండ్ చేశారు.

కులగణనపై జగన్ సంకల్పం భేష్

వందేళ్ల కల సాకారం: కృష్ణయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కులగణనపై సీఎం జగన్ సంకల్పం భేష్ అని వైసీపీ రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య కొనియాడారు. వందేళ్ల కలను సాకారం చేస్తున్న నాయకుడు జగన్ అని ప్రశంసించారు. బడుగు, బలహీనవర్గాలకు ఆయనే బలం, బలగమన్నారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో కృష్ణయ్య బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కులగణన చరిత్రాత్మకమని, అందుకు అందరి మద్దతు అవసరమని అన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బీసీల వ్యతిరేకని విమర్శించారు. బీసీల తోక కత్తిరిస్తా... మత్స్యకారుల తోలుతీస్తానని చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను గుర్తుచేశారు. కులగణనపై టీడీపీ విమర్శల్లో అర్థం లేదన్నారు. వారి మాయమాటలను నమ్మే పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలు లేరని కృష్ణయ్య తెలిపారు. ఏపీ అభివృద్ధితో పాటు పేదల సంక్షేమం కులగణనతో ముడిపడి ఉన్నట్లు చెప్పారు. జనాభా దామాషా ప్రకారం ఆయా కులాల వారికి అవకాశాలు దక్కేందుకు జగన్ బాటలు వేస్తున్నారన్నారు. ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో పేదల మేలుకు కులగణన కీలకం కానుందన్నారు. చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్నాటక, రాజస్తాన్, తమిళనాడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం బీసీలే అయినా కులగణన నిర్వహించేం దుకు ముందుకు రావడంలేదన్నారు. అందుకు జగన్ సాహసోపేతంగా నిర్ణయం తీసుకోవడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారన్నారు. బీసీ డిక్లరేషన్ సభలో బీసీలంటే వెనుకబడిన వర్గం కాదు, వెన్నుదన్ను అని అన్నారు. కులం, మతం, వర్గం, రాజకీయం, ప్రాంతీయ బేధాల్లేకుండా నవరత్నాలు అర్హులందరికీ అందుతున్నాయని తెలిపారు. అమ్మఒడి లబ్ధిదారుల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారే ఎక్కువన్నారు. వైసీపీ మేనిఫెస్టో ప్రకారం ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అమలవుతున్నట్లు చెప్పారు. లబ్ధిదారుల్లో ఆనందం కనిపిస్తోందన్నారు. వివిధ పథకాల ద్వారా నగదు బదిలీ రూపంలో రూ.2.40 లక్షల కోట్లు నేరుగా పేదల ఖాతాల్లో జమ అయినట్లు తెలిపారు. తమది బీసీల ప్రభుత్వమని చెప్పుకునే టీడీపీ మంత్రివర్గంలో బీసీలకు బొటాబొటీ పదవులిచ్చారని కృష్ణయ్య విమర్శించారు.

పొన్నవోలుపై కేసు నమోదు చేయాలి: జగదీశ్ డిమాండ్

విశాలాంధ్ర-గుంతకల్లు: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బెయిల్‌కు సంబం ధించి హైకోర్టు తీర్పును ధిక్కరిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసిన అదనపు అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకరరెడ్డిపై కేసు నమోదు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్ డిమాండ్ చేశారు. సుధాకర్‌రెడ్డి వంటి న్యాయవాదులు అలాంటి వ్యాఖ్యలు చేస్తే సామాన్యులకు న్యాయస్థానాలపై ఎలాంటి అభిప్రాయం ఉంటుందో ఆలోచించాలని సూచించారు. జగదీశ్ బుధవారం సీపీఐ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ స్కిల్‌స్కామ్ కేసులో పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మాటలు అభ్యంతరకరమని, ఆయన ప్రభుత్వ ఉద్యోగిలా కాకుండా వైఎస్ఆర్ పార్టీ అభిమానిగా న్యాయస్థానాలపై వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. తీర్పు సంతృప్తికరంగా లేకపోతే సుప్రీంకోర్టును ఆశ్రయించాలి కానీ న్యాయస్థానాలపై ప్రజల్లో చులకన భావన ఏర్పడేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. రాజ్యాంగ సూత్రాలకు వ్యతిరేకంగా మాట్లాడిన సుధాకర్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని గుంతకల్లు ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఓటర్ల నమోదు, కులగణనను వలంటీర్లతో కాకుండా ఉపాధ్యాయులతో నిర్వహించాలని ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు బి.గోవిందు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేశ్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్, మండల కార్యదర్శి రాము రాయల్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

కళారూపాలతో వ్యవస్థలు మారుద్దాం

జంగాల అజయ్ కుమార్

విశాలాంధ్ర-విజయవాడ: దేశంలో భ్రష్టుపట్టిన వ్యవస్థలను మార్చగలిగే శక్తి కళారూపాలకే ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర బాధ్యులు జంగాల అజయ్ కుమార్ స్పష్టం చేశారు. స్థానిక దాసరి భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర సమితి సమావేశం పి.చంద్రనాయక్ అధ్యక్షతన బుధవారం జరిగింది. అజయ్‌కుమార్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ ధ్వంసమయ్యాయన్నారు. ఐదు రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలనే తాపత్రయంతో బీజేపీ విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నదని, ప్రత్యర్థులపై ఈడీ, సీబీఐ, ఐటీ దాడులకు పురిగొల్పుతోందని విమర్శించారు. కుల, మతాలను ప్రోత్సహిస్తోందని, తెలంగాణలో ఎమ్మార్పీఎస్ నాయకుడు మంద కృష్ణ మాదిగను తన చెంతకు లాగేసుకున్నదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో రాక్షస పాలన కొనసాగుతోందని మండిపడ్డారు. సీఎం జగన్ ప్రధాని మోదీకి వంతపాడుతున్నారన్నారు. దళితులు, మైనారిటీలు, మహిళలపై నిత్యం దాడులు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. మోదీ, జగన్ విశ్వరూపాన్ని ప్రజానాట్యమండలి తమ పాటల ద్వారా జనంలోకి తీసుకెళ్లాలన్నారు. ఇప్టా జాతీయ కార్యదర్శి గని మాట్లాడుతూ మహనీయుల ఆశయాలను నేటి పాలకులు తుంగలో తొక్కుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మహనీయుల ఆశయాలు ముందుకు తీసుకుపోవడానికి డిసెంబర్ 18 నుండి 22 వరకు ఆంధ్రప్రదేశ్‌లో పాదయాత్ర జరుగుతుందని, దీని జయప్రదానికి కృషి చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రనాయక్, చిన్నం పెంచలయ్య మాట్లాడారు. ప్రజానాట్యమండలి సంఘ సభ్యత్వం జనవరి చివరికల్లా పూర్తి చేసి రాష్ట్ర కేంద్రానికి పంపాలని సూచించారు. రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆర్.రామకృష్ణ, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, ఆరేటి రామారావు, ఎస్‌కే నజీర్, ఎస్.గురప్ప, వి.నాగరాజు, ఎ.శివయ్య వివిధ జిల్లాల నాయకులు కేవీ భాస్కరరావు, డి.సూరిబాబు, శామ్యూల్, ప్రేమానందం, బొల్లిముంత కృష్ణ, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక సేవల్లో ఏపీదే అగ్రస్థానం

హోంమంత్రి తానేటి వనిత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అగ్నిమాపక సేవల ఆధునీకరణలో భాగంగా దేశంలోనే ఆంధ్రప్రదేశ్ విపత్తు నియంత్రణ, అగ్నిమాపక దళ విభాగం అగ్రస్థానంలో ఉందని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణశాఖ మంత్రితానేటి వనిత తెలిపారు. అగ్నిమాపక భద్రతా ప్రమాణాలను సులభతరం చేసేందుకు వీలుగా సంబంధిత ఉన్నతాధికారులతో ఆమె బుధవారం ఆంధ్రప్రదేశ్ సచివాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ఫైర్ సర్వీస్ గెజిట్ నోటిఫికేషన్ కమిటీ చైర్మన్ డాక్టర్ రవిశంకర్ అయ్యనార్ కమిటీ నివేదక, సిఫార్సుల పుస్తకాన్ని హోంమంత్రికి అధికారులు అందజేశారు. ఈ సమావేశానికి హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి, కమిటీ కన్వీనర్ జి. విజయ్‌కుమార్, ఇంటిలిజెన్స్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, కమిటీ సభ్యుడు పి. సత్య ఏసుబాబు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. హోంమంత్రి మాట్లాడుతూ వివిధ భవనాలలో అగ్నిమాపక ప్రమాణాలు, నిరభ్యంతర ధృవపత్రం (ఎన్‌ఓసీ) జారీకి సంబంధించి 18 జనవరి 2022 నుంచి 13 అక్టోబర్ 2022 వరకు డీజీ ఫైర్ సర్వీసెస్ ద్వారా ఆరు గెజిట్ ప్రకటనలు జారీ అయ్యాయని వివరించారు. భవనాలను అన్నివిధాలుగా సురక్షి తంగా, భద్రంగా ఉండేలా ఎన్ బీ సీలో పొందుపరచబడిన భద్రతా నిబంధనల ప్రకారం నిర్మించాలన్నారు. సెట్ బ్యాక్, ఖాళీ స్థలాలను నిర్ధారించడానికి స్థానిక భవనాల నిబంధనలను (లోకల్ బిల్డింగ్ రూల్స్) అనుసరించాలని, ఐదేళ్ల వరకు ఉన్న ఎన్‌ఓసీలు ప్రస్తుత చెల్లుబాటు వ్యవధిపై మార్పులు చేయాలనే అంశాలను ప్రతిపాదించారు. హెూంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీశ్ కుమార్ గుప్తా, ఇంటిలిజెన్స్ డీజీ సీతారామాంజనేయులు, ఫైర్ సర్వీసెస్ డీజీ సునీల్ కుమార్, సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ పి. వెంకట రమణ, డెరెక్టర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ మురళీ మోహన్, అడిషనల్ డైరెక్టర్లు శ్రీనివాసులు, జ్ఞానసుందరం ఇతర అధికారులు హాజరై వివిధ సూచనలు, సలహాలు ఇచ్చారు.

గొర్రెలు, మేకల పెంపకందారుల రాష్ట్ర సదస్సు కరపత్రం విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : గొర్రెలు, మేకల పెంపకం దారుల సమస్యలపై డిసెంబరు 13న డోన్ పట్టణంలో తలపెట్టిన రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం విజయవాడ ధర్నా చౌక్ వద్ద కరపత్రాన్ని చేతివృత్తిదారుల సమాఖ్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, ఆంధ్ర ప్రదేశ్ గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కోట్ల పోతులయ్య, ఏపీ కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి జమలయ్య తదితరులు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయానికి అనుబంధంగా, ప్రధాన జీవనాధారంగా ఉన్న గొర్రెలు, మేకల పెంపకం దారులు రెండు కోట్ల ఇరవై ఒక్క లక్షల మంది జీవిస్తున్నప్పటికీ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సన్న జీవాలైన గొర్రెల, మేకల సంరక్షణ కోసం సకాలంలో స్పందించడం లేదని తెలిపారు. భారీగా నిధులు కేటాయిస్తున్నామని చెబుతున్న మాటలు ఆచరణలో కనిపించడం లేదన్నారు. జీవాలకు సీజనల్‌గా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు నాలుగు సార్లు వ్యాక్సిన్లు, మందులు సరఫరా చేయాల్సి ఉండగా కేవలం ఒక్కసారి మాత్రమే సరఫరా చేసి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. దీనివల్ల గొర్రెలు, మేకలు అకాల, సీజనల్ వ్యాధులకు గురవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం సరఫరా చేసే వ్యాక్సిన్‌లు, మందులను పశు సంవర్ధక శాఖ అధికారులు బయట బ్లాక్‌లో అమ్ముకుంటూ వైద్యం చేయకపోవడంతో గొర్రెలు, మేకలు వేల సంఖ్యలో చనిపోతున్నాయని తెలిపారు. కేంద్ర సహకార అభివృద్ధి సంస్థ ద్వారా నిధులన్నీ దుర్వినియోగమవుతున్నాయని, నిజమైన వృత్తిదారులకు సబ్సిడీ పథకాలు చేరకుండా కార్పొరేట్ వ్యాపారులకు లాభాలు సమకూర్చే విధానాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కరువుతో జీవాల పెంపకం దారులు సుదూర ప్రాంతాలకు తరలిపోతున్నారని చెప్పారు. గొర్రెల, మేకల పెంపకం దారులకు సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావడానికి సదస్సులో సమగ్రంగా చర్చిస్తామన్నారు. ఆందోళన కార్యాచరణ రూపొందించేందుకు డిసెంబరు 13న డోన్ పట్టణంలో గొర్రెల, మేకల పెంపకం దారుల రాష్ట్ర సదస్సు జరుగుతుందని, అధిక సంఖ్యలో గొర్రెల, మేకల పెంపకం దారులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గొర్రెల, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర కో-కన్వీనర్లు చింతల కృష్ణ, పొట్టేలు పెంటయ్య, చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర నాయకులు కె.వి.కృష్ణగౌడ్, ఎం.కారన్న, బుద్ధారపు వెంకట్రావు, మల్లు సీతారామ్, ప్రసాద్, రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.నాగేంద్రయ్య పాల్గొన్నారు.



రాజ్యాంగం, దళిత హక్కుల పరిరక్షణే లక్ష్యం

'సామాజిక న్యాయం' రాష్ట్ర సదస్సులో వక్తలు

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: రాజ్యాంగం, దళితుల హక్కుల పరిరక్షణే లక్ష్యమని, అందుకోసం దళిత సామాజిక వర్గాలు పోరాడాలని వక్తలు పిలుపు నిచ్చారు. బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించకపోతే భవిష్యత్‌లో ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాంగం అమలు కాగలదని హెచ్చరించారు. రాజ్యాంగం కల్పించిన దళిత హక్కుల రక్షణకు సామాజిక న్యాయం అంశంపై బుధవారం విశాఖపట్నం, అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ప్రజా సంఘాల అధ్వర్యంలో రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ మాట్లాడుతూ రాజ్యాంగంలో కల్పించిన ప్రాథమిక హక్కుల కోసం బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని వక్కాణించారు. ఉన్నత విద్య పేదలకు అందడం లేదని, సంక్షేమం పేరిట ప్రజలను మభ్యపెడుతున్నారని, రిజర్వేషన్లు ఇవ్వమనడం దుర్మార్గమన్నారు. దళితులలో సామాజిక-ఆర్థిక-రాజకీయపరమైన ఎదుగుదల లేదన్నారు. జాతీయోత్పత్తి సంపదలో సగంవాటా కావాలని డిమాండ్ చేశారు. దళిత్ సోషల్ ముక్తి మంచ్ జాతీయ కార్యదర్శి వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ద్వారా దళితులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల వ్యవస్థ దెబ్బ తింటుందన్నారు. దళితులకు, వ్యవసాయ కార్మికుల వ్యతిరేకమైన కేంద్రప్రభుత్వ విధానాలను నిరసిస్తూ డిసెంబర్ 4న 150 దళిత, వ్యవసాయ కార్మిక సంఘాల అధ్వర్యంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని దళిత-వ్యవసాయ కార్మిక సంఘాలను సమాయత్వం చేయడమే సదస్సు ఉద్దేశమన్నారు. దీనిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడం మన కర్తవ్యమని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. దళితులకు జనాభా ప్రాతిపదికన భూవాటా ఉండాలన్నారు. సమావేశంలో ఏఐడీఆర్ఎం జాకీ కార్యదర్శి ఎ.రామ్మూర్తి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లేపల్లి లక్ష్మయ్య, డీబీఎస్‌ఈ రాష్ట్ర అధ్యక్షులు చిట్టిబాబు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కథవరి సుబ్బారావు, అధ్యక్షులు జేవీ ప్రభాకర్ రావు, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు కల్యాణ్ రావు, ఐడీజేయూ రాష్ట్ర అధ్యక్షుడు నానాజీ పాల్గొన్నారు.

ముండ్లపూడి కృష్ణాలయాన్ని పునరుద్ధరించాలి: శివనాగిరెడ్డి

తిరుపతి: తిరుపతి పరిసరాల్లో, తిరుచానూరు దగ్గరున్న ముండ్లపూడి లోని చోళుల కాలంనాటి కృష్ణాలయాన్ని పునరుద్ధరించాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డా.ఈమని శివనాగిరెడ్డి అన్నారు. తిరుపతికి చెందిన వారసత్వ కార్యకర్త బీవీ రమణ ఇచ్చిన సమాచారం మేరకు ఆయన ముండ్లపూడి కృష్ణాలయాన్ని బుధవారం సందర్శించారు. గర్భాలయం, అర్ధ మండపం, మహా మండపంలో ఉన్న ఈ ఆలయానికి కప్పుపైన శిఖరం లేదని, బయట గోడలు బీటలువారాయని, అధిష్ఠానం భూమిలో కూరుకుపోయిందన్నారు. గర్భాలయంలో కృష్ణుడి విగ్రహం లేదని చెప్పారు. ఆలయాన్ని పూర్తిగా పునరు ద్ధరించి, పరిరక్షించుకోవాలని ముండ్లపూడి గ్రామస్తులు, సంబంధిత అధికారులను శివనాగిరెడ్డి కోరారు. 'ముండ్లపూడి అసలు పేరు మునైపూండి. రాజరాజ నరేంద్రుని కాలంలో ఆయనకుగల బిరుదుపై ఆ గ్రామానికి శివపాదశేఖర నల్లూరనే పేరు కూడా ఉంది' అని ఆయన చెప్పారు.

విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రవేశాలకు నోటిఫికేషన్

- దరఖాస్తుకు ఫిబ్రవరి 25 చివరి తేదీ
- మార్చి 1 నుంచి బీటెక్/బీఫార్మసీ ప్రవేశ పరీక్ష
- వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ నాగభూషణ్ వెల్లడి

విశాలాంధ్ర-గుంటూరు : యువతకు అత్యున్నత ఉద్యోగాలు కల్పించడం, వారిని గొప్ప పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేలా చేయడం, పరిశోధనలకు పెద్దపీట వేయడం లాంటి సమున్నత లక్ష్యాలతో తాము ముందుకెళుతున్నామని విజ్ఞాన్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీ 2024-25 సంవత్సరానికి సంబంధించి బీటెక్, బీఫార్మసీ, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఏ ఎల్ఎల్‌బీ, బీబీఏ ఎల్ఎల్‌బీ, బీఎస్సీ(హానర్స్) అగ్రికల్చర్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంఏ ఇంగ్లీష్, పీహెచ్‌డీ అడ్మిషన్ల (వీశాట్-2024) నోటిఫికేషన్‌ను ఆయన బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ తాము బీటెక్‌లో అగ్రికల్చర్, బయోటెక్నాలజీ, బయోఇన్ఫర్మాటిక్స్, బయోమెడికల్, కెమికల్, సివిల్, సీఎస్ఈతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, బిజినెస్ సిస్టమ్స్, డేటాసైన్స్, ఐవోటీ, ఈసీఈ, ఈసీఈ-వీఎల్ఎస్ఐ, ఈఈఈ, ఫుడ్ టెక్నాలజీ, ఐటీ, మెకానికల్, టెక్స్‌టైల్ టెక్నాలజీ, బీఎస్సీ అగ్రికల్చర్, బీఏ(ఎల్ఎల్‌బీ), బీబీఏ(ఎల్ఎల్‌బీ), బీఎస్సీ(హానర్స్) అగ్రికల్చర్, బీఫార్మసీ కోర్సులను అందజేస్తున్నామన్నారు. బీటెక్, బీఫార్మసీ కోర్సులలో ప్రవేశాలకు తాము దేశవ్యాప్తంగా చేపట్టనున్న వీశాట్ ప్రవేశ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్‌లు పొందే అవకాశం ఉందని చెప్పారు. యూనివర్సిటీ డీన్ అడ్మిషన్స్ డాక్టర్ కె.వి.కృష్ణకిషోర్ మాట్లాడుతూ వీశాట్ దరఖాస్తులు గుంటూరు, విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్టణం, ఏలూరు, రాజమండ్రిలోని అన్ని విజ్ఞాన్ సంస్థలు, కార్యాలయాల్లో అందుబాటులో ఉంటాయన్నారు. విద్యార్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్ ఒఒఒ.జఱస్త్రఅఖఅ.ఖ఻.ఱఅ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మార్చి 1 నుంచి ఏప్రిల్ 30 తేదీ వరకు ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. వీశాట్-2024 దరఖాస్తును ఫిబ్రవరి 25వ తేదీలోగా పూర్తిచేయాలన్నారు. వీశాట్‌లో తొలి 50 లోపు ర్యాంకులు సాధించిన వారికి 50 శాతం, 51-200 లోపు ర్యాంకుల వారికి 25 శాతం, 201-2000 లోపు ర్యాంకులు సాధించినవారికి 10 శాతం ఫీజు స్కాలర్‌షిప్ అందజేస్తున్నట్లు చెప్పారు. ఇంటర్ మార్కులు, జేఈఈ, మెయిన్స్, ఎంసెట్ ర్యాంకుల ఆధారంగానూ ఫీజు స్కాలర్‌షిప్‌కు అవకాశం ఉందని ఆయన వెల్లడించారు. ప్రతిభావంతులైన బీఫార్మసీ, బీబీఏ, బీసీఏ, బీఏ ఎల్ఎల్‌బీ, బీబీఏ ఎల్ఎల్‌బీ, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు చదివే విద్యార్థులు సైతం ఫీజుల్లో స్కాలర్‌షిప్ పొందొచ్చన్నారు. అన్ని విభాగాల్లో 25 శాతం సీట్లను స్కాలర్‌షిప్ కింద కేటాయించామన్నారు. వీటిని పూర్తిగా ప్రతిభ ఆధారంగా భర్తీ చేస్తామని తెలిపారు. వీశాట్ పరీక్ష రాసిన వారికి బీటెక్ సీట్ల కేటాయింపులో తొలి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, డైరెక్టర్ అడ్మిషన్స్ ఎ.గౌరిశంకర్ రావు పాల్గొన్నారు.

సంపాదకీయం

మోదీ ప్రభుత్వ కక్ష సాధింపు

అయిదు రాష్ట్రాల శాసనసభ ఎన్నికల్లోనే కాకుండా 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలలో బీజేపీకి విజయవకాశాలు రాను రాను మృగ్యం అవుతున్నాయన్న భయం మోదీని పీడిస్తోంది. గత కొద్ది సంవత్సరాలుగా కేంద్ర ప్రభుత్వ వ్యవస్థలైన సీబీఐ, ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టొరేట్, ఆదాయపు పన్ను శాఖను దుర్వినియోగంచేసి కాంగ్రెస్‌నే కాక ప్రతిపక్ష నాయకులందరినీ మోదీ ప్రభుత్వం బోనులో నిలబెడ్తోంది. ఈ దాడులకు తట్టుకోలేని ఇతర పార్టీల నాయకులు బీజేపీ గంగలో మునిగి పునీతులైపోతున్నారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ అన్నది మోదీ నినాదం. 2014, 2019 సార్వత్రిక ఎన్నికలలో ఓటమి తరవాత కాంగ్రెస్ బలహీనపడిన మాట వాస్తవం. కానీ రాహుల్ గాంధీ "భారత్ జోడో యాత్ర" కాంగ్రెస్‌కు కొత్త ఊపిరులూదింది. రాహుల్ గాంధీ వ్యక్తిత్వంలోనూ, వ్యవహార సరళిలోనూ స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. ముఖ్యంగా అదానీ వ్యవహారాన్ని లేవనెత్తడంలో రాహుల్ గాంధీ మిగతా ప్రతిపక్ష నేతలకన్నా చురుగ్గా కృషి చేశారు. దీనితో మోదీ ఇరుకున పడ్డారు. అందుకే జవహర్ లాల్ నెహ్రూ స్థాపించిన "నేషనల్ హెరాల్డ్" పత్రికలో అవకతవకలు జరిగాయని, డబ్బు అక్రమ చెలామణి జరిగిందని కొత్త ఆరోపణలు ప్రారంభించారు. ఈ విషయంలో రాహుల్ గాంధీని, సోనియా గాంధీని గంటల తరబడి దర్యాప్తు సంస్థలు విచారించాయి. చివరకు మంగళవారం నేషనల్ హెరాల్డ్ పత్రిక నిర్వహణా సంస్థకు చెందిన రూ. 752 కోట్ల ఆస్తులను జప్తు చేశారు. నిజానికి నేషనల్ హెరాల్డ్ వ్యవహారం న్యాయవ్యవస్థ పరిశీలనలో ఉంది. కానీ న్యాయవ్యవస్థ పరిశీలన మోదీ ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేదిగా కనిపించనందువల్ల ప్రభుత్వ నేషనల్ హెరాల్డ్ ఆస్తులను జప్తు చేసి రాహుల్‌ను, సోనియా గాంధీని దోషులుగా తేల్చాలని పాట్లు పడ్తోంది. పైగా ఒక వేపున అయిదు రాష్ట్రాల ఎన్నికలు, మరో అయిదు నెలల్లోగా జరగవలసిన ఎన్నికలలో ప్రయోజనం పొందాలంటే కేవలం మతతత్వ రాజకీయాలే ఉపకరించవని నిర్ణయించుకున్నందువల్ల ఆర్థిక లావాదేవీలలో అక్రమాల ఆరోపణలకు తెరతీశారు. అందుకే ఇ.డి. నేషనల్ హెరాల్డ్ ఆస్తులను జప్తుచేసింది. ఇది చివరికి మోదీకి పక్కలో బల్లెంలా మారుతున్న రాహుల్ గాంధీ అరెస్టుకు దారితీసినా ఆశ్చర్య పడవలసిన పనిలేదు. కానీ రాహుల్ గాంధీని అరెస్టుచేస్తే బీజేపీకి లాభం కన్నా నష్టమే ఎక్కువ అన్న అంశాన్ని బీజేపీ నాయకత్వం సంకటస్థితిలో పడింది. కర్నాటకలో ఎన్నికల ప్రచారంలో ప్రసంగించిన సందర్భంలో రాహుల్ గాంధీ మోదీ అన్న ఇంటిపేరు ఉన్న వాళ్లందరూ మోసగాళ్లే ఎందుకు అవుతారు అని వ్యాఖ్యానించడాన్ని ఆయన వ్యాఖ్య నరేంద్ర మోదీని ఉద్దేశించి చేసిందే అని కువ్యాఖ్యానాలుచేసి రాహుల్ గాంధీ మీద గుజరాత్‌లోని సూరత్‌లో పరువునష్టం కేసు దాఖలు చేయించారు. ఆ తరవాత కింది కోర్టు, హైకోర్టు తీర్పుల ఆధారంగా రాహుల్ లోకసభ సభ్యత్వాన్ని కూడా ఆదరాబాదా రద్దు చేయించారు. ఆ తరవాత జరిగిన న్యాయపోరాటం కారణంగా రాహుల్‌గాంధీ లోకసభ సభ్యత్వం పునరుద్ధరించారు. లోకసభలో రాహుల్‌కు స్థానం లేకుండా చేయాలన్న ఎత్తుగడ బెడిసికొట్టడం బీజేపీ-ఆర్.ఎస్.ఎస్.కు అవమానకరంగా తయారైంది. నేషనల హెరాల్డ్ ఆస్తులు జప్తు చేయాలని ఇ.డీ. ఆదేశించిన రోజు యాదృచ్ఛికంగా జరిగిన పరిణామం కాదు. సరిగ్గా అదే రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజస్థాన్‌లోని బరన్ జిల్లాలో ఒక ఎన్నికల సభలో మాట్లాడుతూ కాంగ్రెస్ అవినీతి, బంధు ప్రీతి, మైనారిటీలను సంతృప్తి పరచడానికి ప్రతీక అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రాతినిధ్యం వహించే ఈ మూడు అవలక్షణాలు అంతమైతే తప్ప దేశం అభివృద్ధి సాధించడం సాధ్యం కాదని కూడా మరో వ్యాఖ్యానం ఓడించారు. మోదీ చేసిన ఈ వ్యాఖ్యలే నేషనల్ హెరాల్డ్ ఆస్తుల జప్తుకు ఇ.డి. ఆదేశించడానికి సంకేతంగా ఉపకరించింది.

రాహుల్ గాంధీని ఎంత అవహేళన చేసినా ఆయన నాయకత్వంలోనే 2022 నవంబర్‌లో హిమాచల్‌ప్రదేశ్‌లో బీజేపీని కాంగ్రెస్ ఓడించగలిగింది. అలాగే మే 23లో కర్నాటక శాసనసభ ఎన్నికలలో బీజేపీ ఘోరంగా ఓడిపోయింది. అంతవరకు కర్నాటక ముఖ్యమంత్రిగా ఉన్న బసవరాజ్ బొమ్మైని మిస్టర్ 40% అని జనం సంబోధించడం మాత్రం మోదీ డిక్షనరీలో అవినీతి కాదు. మోదీ ఎంత వెనకేసుకొచ్చినా కర్నాటక ప్రజలు కర్నాటకలో నిర్ణాయకమైన రీతిలో బీజేపీకి గుణపాఠం నేర్పారు. ఈ విజయంలో రాహుల్ గాంధీ పాత్ర తక్కువేమీ కాదు. మోదీ ఉంటే ఏదైనా సాధ్యమే అని చేసిన ప్రచారం హిమాచల్ ప్రదేశ్, కర్నాటకలో బోల్తా పడింది. బీజేపీకి దీటైన రాజకీయ ప్రత్యర్థులు అనుకున్న మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ మొదలైన వారిమీద కూడా మోదీ ప్రభుత్వం ఇ.డి. చేత దాడులు చేయించింది. ఈ జాబితా చాలా పొడవైంది. ఇ.డి. దాడులే ప్రతిపక్షాలను ఐక్యం చేస్తున్నాయి అని మోదీయే స్వయంగా అంగీకరించారు. ఆయన అన్నట్టే ప్రతిపక్షాలు "ఇండియా" ఐక్య సంఘటన ఏర్పాటు చేశాయి. దానితో మోదీలో ఓటమి భయం గూడు కట్టుకుంది. మతతత్వ విధానాల లోగుట్టును జనం గ్రహించడంతో ఇక ప్రతిపక్ష నేతల మీద అవినీతి ఆరొపణలు మోపి అపఖ్యాతిపాలు చేయడమే మార్గం అని మోదీ నిర్ణయించుకున్నట్టున్నారు. నేషనల్ హెరాల్డ్ ఆస్తుల జప్తు కచ్చితంగా అందులో భాగమే. న్యాయస్థానాలు ఈ కేసులో నిజానిజాలు తేల్చే దాకా ఓపిక పట్టే ఓర్మి కూడా మోదీ ప్రభుత్వానికి లేదు. అవినీతి, డబ్బు అక్రమ చెలామణి జరిగిందనుకున్నప్పుడు ఎవరి మీదైనా చర్య తీసుకోవచ్చు. వారిని చట్టప్రకారం శిక్షించవచ్చు. న్యాయస్థానాలు నిజానిజాలు తేల్చేదాకా ఆగొచ్చు. కానీ ఈ దారి తమ కుటిల యత్నాలకు ఉపకరించదని మోదీ నాయకత్వంలోని బీజేపీకి తెలుసు. కేంద్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థలను ప్రత్యర్థులమీద వినియోగించి అవినీతిని నిర్మూలించడంలో తమకు సరిపోలేవారు లేరని నిరూపించాలన్న ఆతృత బీజేపీని వేధిస్తోంది. నేషనల్ హెరల్డ్ మీద పరిపాలనా పరంగా తీసుకుంటున్న చర్యలను న్యాయప్రక్రియ తెమల్చేదాకా ఆగాలన్న కనీస దృష్టి కూడా మోదీ ప్రభుత్వానికి లేదు. ఇవేవీ లెక్కచేసే స్థితిలో బీజేపీ లేదు. అంతిమంగా రాహుల్ ను, సోనియాను, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను అరెస్టు చేస్తారా లేదా అన్నది తెలియదు కానీ ఈ లోగా కాంగ్రెస్ అగ్ర నేతలను భ్రష్టు పట్టించి ఎన్నికల్లో గట్టెక్కాలన్న దుర్బుద్ధి మాత్రం మోదీ నాయకత్వంలోని బీజేపీకి దండిగా ఉంది. లోకసభ ఎన్నికలు దగ్గరపడే కొద్దీ మోదీ ప్రభుత్వ ఆగడాలు మితిమీరినా ఆశ్చర్యపడవలసిన పనిలేదు. ఎన్ని అడ్డదార్లు తొక్కి అయినా ధికారం నిలబెట్టుకోవాలన్నది ఒక్కటే అంతిమ లక్ష్యం.

కరువు నివారణకు సమగ్ర వ్యూహం అవసరం

దా. యం. సురేష్ బాబు

భారతదేశంలోని అనేక ప్రాంతాలలో కరువు పునరావృతమయ్యే ఒక క్లిష్టమైన సమస్య ప్రతిబింబిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ జిల్లాలలో కరువు బహుముఖ ప్రభావాలను కలిగి ఉంటుంది. దాని నిలకడ ప్రభావిత ప్రాంతాలకు తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తుంది. భారతదేశంలోని 68శాతం పైగా కరువుతో ప్రభావితమైంది. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో కరువు నిరంతర సమస్యగా మారింది. కరువు పరిస్థితులు తరచుగా పంట వైఫల్యానికి దారితీస్తాయి. ముఖ్యంగా వ్యవసాయరంగంలో గణనీయమైన ఆర్థిక ఒత్తిడి కలిగిస్తాయి. దీర్ఘకాలిక కరువు భూగర్భ జలాలస్థాయి క్షీణతకు దోహదం చేస్తుంది. నీటి కొరత సమస్యలను మరింత తీవ్రతరం చేస్తుంది. పంట నష్టాలు, రుణాలు చెల్లించలేకపోవడంవల్ల రైతులు, సంఘాలు అప్పుల బారినపడే అవకాశంఉంది. ప్రజలు మెరుగైన జీవన పరిస్థితులు, ఆర్థిక అవకాశాలు కరువు వలసలను ప్రేరేపిస్తుంది. కరువు వలన కలిగే మానసిక, ఆర్థిక ఒత్తిడి రైతుల ఆత్మహత్యలకు ప్రేరేపిస్తుంది. ఆహారం, నీరు, ఆర్థిక సహాయం అందించడం వంటి కరువు తక్షణ ప్రభావాలను పరిష్కరించడానికి సహాయక చర్యలు అమలుచేశారు. ప్రభావిత జనాభా అనుసరించే పోరాట వ్యూహాలలో జీవనోపాధి వైవిధ్యం, నీటి సంరక్షణ పద్ధతులు, సమాజ-ఆధారిత కార్యక్రమాలు ఉండాలి. కరువు ప్రభావాలను సమర్థవంతంగా తగ్గించడంలో స్వల్పకాలిక చర్యల అసమర్థత, సమగ్రమైన విధానం అవసరాన్ని నొక్కి చెప్పాలి. కరువు మూల కారణాలను, దాని ప్రభావాలను పరిష్కరించడానికి సమగ్ర అభివృద్ధి వ్యూహం అవసరం. ఈ వ్యూహంలో స్థిరమైన నీటి నిర్వహణ, వ్యవసాయ వైవిధ్యం, కరువును ఎదుర్కొనేందుకు స్థితిస్థాపకతను నిర్మించడానికి మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి దీర్ఘకాలిక చర్యలు ఉండవచ్చు. అనంతపురం వంటి ప్రాంతాల్లో కరువువల్ల ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కోడానికి సమగ్రమైన శాశ్వతమైన విధానం అవసరమని ప్రస్తుత పరిస్థితి నొక్కి చెబుతోంది. ఇందులో తక్షణ సహాయకచర్యలు మాత్రమే కాకుండా, ఈ ప్రాంతంలో కరువు పునరావృతం తీవ్రత దోహదపడే అంతర్గత సమస్యలను పరిష్కరించే సమగ్ర అభివృద్ధి వ్యూహాలు వైపు ప్రయత్నాలు చేయాలి. కరువు వాతావరణం, జల సంబంధిత, వ్యవసాయ, సామాజిక,ఆర్థిక రకాలుగా వర్గీకరించారు. గ్రామీణ పేదరికం, వాతావరణ, జల సంబంధిత, వ్యవసాయ, సామాజిక,ఆర్థిక కరువు సంచిత ప్రభావం, గ్రామీణ పేదరికం, ఆహార అభద్రతకు దోహదం చేస్తుంది. ఇది తక్షణ వ్యవసాయ ఆందోళనలకు మించి కరువు పరిణామాలను హైలైట్ చేస్తుంది. కరువు సహజ, సామాజిక భాగాలు రెండింటినీ కలిగి ఉంది. సహజ అంశంలో వాతావరణ, జల సంబంధ కారకాలు ఉన్నాయి. అయితే సామాజిక అంశంలో వ్యవసాయ పద్ధతులు, సామాజిక ఆర్థిక పరిస్థితులు, సామాజిక దుర్బలత్వం ఉంటాయి. కరువుతో సంబంధం ఉన్న ప్రమాదం ఒక ప్రాంత సంఘటనకు గురికావడం, సమాజ దుర్బలత్వం రెండింటి ద్వారా ప్రభావితమవుతుంది. కరువుకు గురికావడం ప్రాదేశికంగా మారుతూ ఉంటుంది. జనాభా, సాంకేతికత, విధానాలు సామాజిక ప్రవర్తనలో మార్పులకు ప్రతిస్పందనగా కాలక్రమేణా మారుతున్న డైనమిక్ అంశంగా దుర్బలత్వం హైలైట్ చేశారు. అదే ప్రాంతంలో తదుపరి కరువులు తీవ్రత, వ్యవధి ప్రాదేశిక లక్షణాలపరంగా ఒకేలా ఉన్నప్పటికీ, సామాజిక లక్షణాలలో మార్పుల కారణంగా వాటి ప్రభావాలు భిన్నంగా ఉంటాయి. కరువు ప్రభావాలను పరిష్కరించేటప్పుడు అభివృద్ధి చెందుతున్న సామాజిక సందర్భాన్ని పరిగణనలోకి తీసుకోవడం వంటి ప్రాముఖ్యతను ఇది నొక్కి చెబుతుంది. మెరుగైన సాంకేతిక, విధానాలు, సామాజిక ప్రవర్తనల వంటి లక్ష్య చర్యలు, స్థితిస్థాపకత పెంపొందించడానికి, సంఘాలపై కరువు ప్రతికూల ప్రభావాన్ని తగ్గించడానికి దోహదం చేయగలవని ఇది సూచిస్తుంది. కరువు సంక్లిష్టత, సహజ సామాజిక కారకాల మధ్య పరస్పర చర్య దుర్బలత్వం డైనమిక్ స్వభావం. కరువు ప్రభావాలను సమర్థవంతంగా తగ్గించడానికి, అభివృద్ధి చెందుతున్న సామాజిక సందర్భాన్ని పరిగణనలోకి తీసుకునే సమగ్ర వ్యూహాల అవసరాన్ని ఇది నొక్కి చెబుతుంది రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలో కరువు పరిస్థితుల ప్రభావాన్ని అంచనా వేయాలి. గ్రామీణ జీవనోపాధి విస్తృత సందర్భంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. భూగర్భజల వనరుల క్షీణత, తక్కువ పంట ఉత్పత్తి, ప్రత్యామ్నాయ జీవనోపాధి కార్యకలాపాల కోసం వలసలు పెరగడం వంటివి పరిష్కరించాల్సిన ప్రధాన సమస్యలు. ఉత్తరాంధ్ర, రాయలసీమలో నిరంతర కరువు పరిస్థితిని ఎదుర్కొంటుంది. కరువు ప్రభావాన్ని అంచనా వేయడానికి ముందు, అధ్యయనం కరువు జిల్లాల భౌగోళిక లక్షణాలను ఆ ప్రాంతంలో కరువుకుగల నిర్దిష్ట కారణాలను అర్థం చేసుకోవడం ప్రాముఖ్యతను గుర్తిస్తుంది. ప్రభుత్వ నివేదికలు, స్థానిక వార్తాపత్రికలు/మీడియా ప్రభుత్వేతర సంస్థలు కరువు ప్రూఫింగ్ కార్యకలాపాలతో సహా వివిధ వనరుల నుండి సెకండరీ డేటా కూడా ఉపయోగిస్తున్నారు. ఫీల్డ్ వర్క్ రెండు ప్రధాన దశలుగా విభజించారు. మొదటి దశలో, కరువు జిల్లాలోని అనేక కరువు ప్రభావిత గ్రామాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించడం. కరువు జిల్లాలోని గ్రామీణ జీవనోపాధి నిరంతర కరువు ప్రభావాన్ని సమగ్రంగా అంచనా వేసేందుకు ఈ అధ్యయనం ఉపయోగపడుతుంది. దీర్ఘకాలిక కరువు, వర్షపాతం లోపము వలన సహజవనరుల వెలికితీత వరుసగా క్షీణతకు దారితీస్తుంది. ఇది వ్యవసాయోత్పత్తి, పశువులు మానవ జీవన పరిస్థితులపై ప్రతికూల ప్రభావాలను చూపుతుంది. ఫలితంగా ఉత్పత్తి నష్టం, వ్యవసాయ ఆదాయాలు తగ్గుతాయి. దీర్ఘకాలిక కరువు భవిష్యత్తులో భూమిని ఎడారిగా మార్చడానికి దారితీయవచ్చు, ఇది వ్యవసాయ ఉత్పత్తి, పశువుల జనాభా రెండింటినీ ప్రభావితం చేస్తుంది.

మోదీ తప్పుకోవాలంటున్న ఆర్ఎస్ఎస్

అరుణ్ శ్రీ వత్సవ

బీజేపీ రాజకీయ, భావజాల ప్రయోజనాల పరిరక్షణకోసం ప్రధాని నరేంద్రమోదీని తప్పించాలని ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్‌ను సీనియర్ ఆర్ఎస్ఎస్ నాయకులు ఒత్తిడిచేస్తున్నారు. నరేంద్ర మోదీ వ్యవహారసరళి సక్రమంగా లేదని ఆయన తక్షణ తప్పుకోవలసిందిగా కోరాలని భగవత్‌ను వీరు కోరుతున్నారు. చాలాకాలంగా మోదీ జాతీయ సమస్యలపై అనుసరిస్తున్న వైఖరిపై ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే బహిరంగంగా విమర్శించకూడదన్న ఆర్ఎస్ఎస్ విధానాన్ని అనుసరించి భగవత్ మీదనే వత్తిడి పెడుతున్నారు. అంతర్గతంగా మోదీ విధానాలను విమర్శిస్తున్నారు. ఈ విషయాన్ని ఈ సంవత్సరం మే నెల ఆర్ఎస్ఎస్ పత్రిక ఆర్గనైజర్ సంపాదకీయంలో స్పష్టంగా పేర్కొన్నారు. మోదీ కనీసం తన విధానాన్ని మార్చుకుని సహేతుకంగా పనిచేయగలరని సంపాదకీయంలో ఆశించారు. అయితే ఆర్ఎస్ఎస్ ఆశించినవిధంగా జరగడంలేదు. ఐదు రాష్ట్రాల్లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో సైతం మోదీ అనుసరిస్తున్న పద్ధతులు తమ విశ్వాసాన్ని నిర్ధారణ చేశాయని సీనియర్ నాయకులు చెబుతున్నారు. మోదీ నాయకత్వంలో బీజేపీ సరైన రాజకీయ మార్గాన్ని తప్పినడుస్తున్నదని ఈ నాయకులు విమర్శిస్తున్నారు. మోదీ సీనియర్ నాయకులను పక్కనబెట్టడం వల్ల ఎక్కువభాగం ఆర్ఎస్ఎస్ ప్రతిష్ట దెబ్బతినిపోయిందని వీరు విమర్శిస్తున్నారు. విచ్ఛిన్నకర రాజకీయాలను అనుసరించవద్దని ఆర్ఎస్ఎస్ ముందుగానే తగుచర్యలు తీసుకుని మోదీని ఆదేశించవలసిందని ఈ నాయకులు అంటున్నారు.

మోదీని తగినవిధంగా నడిపించడంలేదని కొంతమంది సీనియర్ నాయకులు భగవత్‌ను కూడా విమర్శిస్తున్నారు. ఆర్గనైజర్ మే నెల సంపాదకీయంలో హెచ్చరించిన తర్వాత మోదీ మరింత విచక్షణతో వ్యవహరిస్తారని రాష్ట్రస్థాయిలో ఉండే నాయకులకు కూడా ప్రాధాన్యత ఇస్తారని భావించారు. అయితే మోదీ మాత్రం తానొక్కడినే బీజేపీ నాయకుడిగా తననుతాను ప్రదర్శించుకుంటున్నారని ఈ నాయకులు చెబుతున్నారు. మోదీ క్రమక్రమంగా ప్రజాభిమానాన్ని, తన ప్రతిష్టను కోల్పోయారని కావాలని సీనియర్ నాయకులను అవమానిస్తున్నారని, ఇప్పటికీ తనధోరణి ఏమీమారలేదని ఈ విషయం స్పష్టంగా తెలిసిపోతున్నదని వారు విమర్శిస్తున్నారు. బీజేపీ సంక్షోభంలో ఉన్నకాలంలో, పార్టీ తిరిగి కోలుకునేట్లుచేసిన నాయకుదుని తాను ఒక్కడినేనని భావిస్తున్నారు. స్వీయప్రతిష్టను పెంచుకునేందుకు అన్నివిధాలుగా మోదీ ప్రయత్నిస్తున్నాడని అసహనం వ్యక్తంచేస్తున్నాడని అంటున్నారు. చత్తీస్‌ఘడ్‌లో రమణ్‌సింగ్, మధ్యప్రదేశ్‌లో శివరాజ్‌సింగ్ చౌహాన్, రాజస్థాన్‌లో వసుంధర రాజేలను మోదీ, అమిత్‌షాలు కావాలని విస్మరించారని, ఈ నాయకులనుంచి మోదీకి ఎలాంటి తీవ్రమైన ముప్పు లేదని ఈ నాయకులు అంటున్నారు. వసుంధర రాజె ఒక సేవకురాలిపాత్ర నిర్వహించడానికి ఇష్టపడదు. అందువల్లనే ఆమెను పట్టించుకోలేదు. మోదీ అహంభావంతో ఉంటారు. ఆత్మగౌరవంతో మెలగరు అని సీనియర్ నాయకులు అంటున్నారు.

ఆయనవద్ద ఉండే ఆలోచనాపరులు, సలహాదారుల సూచనలమేరకు తానే గొప్పవాడినని చాటుకునే భావన కొంతమేరకు తగ్గినప్పటికీ ఇప్పటికే తిరిగి బాగుచేయలేనంతగా పార్టీ నష్టపోయిందని వారు పేర్కొంటున్నారు. నిరాకరణ, అహంభావ ధోరణి కలిగిన మోదీ కారణంగా క్షేత్రస్థాయిలోని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సంఘానికి దూరమయ్యారని ఆ సంస్థలోని కొన్ని వర్గాలు వెల్లడించాయి. ఎన్నికల్లో పోటీచేయడానికి అభ్యర్థులకు టిక్కెట్లు ఇచ్చే సమయంలో ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకులు సూచించిన వారికి అమిత్‌షా అవకాశం ఇవ్వలేదని కావాలనే ఇలా వ్యవహరించారని ఆ సంస్థ వర్గాలు తెలిపాయి. ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకులపై వ్యతిరేకత క్షేత్రస్థాయి కార్యకర్తలపై తీవ్రప్రభావం చూపింది. దిగువస్థాయి కార్యకర్తలు అంతా బాగానే ఉన్నారని చెబుతూ జరిగిన నష్టాన్ని పైకి చెప్పడంలేదు. బీజేపీ అభ్యర్థులు గెలుపొందుతారని మాత్రమే మాట్లాడుతున్నారు. 2009లో జరిగినట్లుగానే ఇప్పుడుకూడా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఎంపిక చేసుకున్న ప్రాంతాలలోనే ఓటింగ్‌లో పాల్గొనున్నారు. 2024 లోకసభ ఎన్నికల్లో మోదీ గెలవాలని కొంతమంది ఆర్ఎస్ఎస్ నాయకులు కోరుకోవడంలేదు. ఆర్ఎస్ఎస్ సీనియర్ సిద్ధాంతకర్త ఎంజి వైద్య 2021లో అతిముఖ్యమైన వివాదాస్పద విషయాన్ని వెల్లడించారు. బీజేపీ అధ్యక్షుడిగా నితిన్ గడ్కరీ రాజీనామా చేయాలని రామ్‌జెఠల్మాని వివాదంచేయడం వెనుక అప్పటి ముఖ్యమంత్రి మోదీ ఉన్నారని వైద్య అసలు విషయాన్ని బైటపెట్టారు. అప్పుడు ఆర్ఎస్ఎస్ వైద్యను దూరంపెట్టింది. అయితే ఆయనను దూరంగా ఉంచడంవల్ల పార్టీకి ఆ తరువాత తీవ్రనష్టం జరిగింది. దాదాపు బీజేపీ సీనియర్ నాయకులంతా ఆయనను ఆదరించలేదు. అందువల్లనే ఇప్పుడు విమర్శిస్తున్న సీనియర్ నాయకులు బహిరంగంగా విమర్శించడంలేదు.

ఇప్పటికీ ఆర్ఎస్ఎస్ నాయకత్వం వైద్యకు దూరంగానే ఉన్నది. అయితే ఆయన మాత్రం తాను వెల్లడించినదాని కట్టుబడి ఉన్నారు. "ఎల్‌కె అద్వాని, నితిన్ గడ్కరీ తాము ప్రధానమంత్రి పదవిని అభిలషించడంలేదని బహిరంగంగానే ప్రకటించారు. అయితే తనకు ప్రధాని పదవి కావాలని నరేంద్ర మోదీ కోరలేదన్న వార్తలను ఎక్కడా నేను చదవలేదు." అని వైద్య అన్నారు. గడ్కరీ రాజీనామా, అదే సమయంలో నరేంద్ర మోదీ ప్రధాని కావాలన్న డిమాండ్‌ను జెఠ్మలానీ చేశారని ఈ విషయంలో అనవసరమైన సందేహాలు గుజరాత్‌లో ఉన్నాయని వైద్య చెప్పారు. మోదీ అనుచరులు వెంకయ్యనాయుడు స్పందిస్తూ "నేను కూడా ఆర్ఎస్ఎస్ స్వయం సేవకుడిని. అర్ఎస్ఎస్‌లో 40ఏళ్లుగా పనిచేస్తున్నాను. అలాంటి భావాలను నేను ఏ రోజు వెలువరించలేదు. పైగా ఆ భావన ఆర్ఎస్ఎస్ అధికారమైనది కాదు. ఈ విషయం స్పష్టంగా చెబుతున్నాను. నాకు తెలిసినంతవరకు, స్వయంసేవక్‌గా నా అవగాహనమేరకు అలాగే బీజేపీ కార్యకర్తగా అలాంటి వార్తలను విశ్వసించబోను." అయితే ఈ మొత్తం వ్యవహారంపైన మోహన్ భగవత్ మౌనంగానే ఉన్నారు. 2013లో ప్రధాని అభ్యర్థిగా ఆర్ఎస్ఎస్ ఎంపికచేసింది. ఆయన ఆర్ఎస్ఎస్‌పై విశ్వాసంగా ఉన్నారా లేదా అనేది చర్చించవలసింది. బీజేపీ ప్రతినిధికి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను, ధనాన్ని ఎన్నికల సమయంలో సమకూర్చాలని కూడా ఆ సంస్థ నిర్ణయించింది. మోదీని భగవత్ పెద్ద భూతంలా తయారు చేశాడన్న విషయం తిరస్కరించలేనిది. ఆర్ఎస్ఎస్ విభాగమైన బీజేపీ ఉనికినే మోదీ నాశనం చేస్తాడని సంఘ్ సీనియర్ నాయకులు భావిస్తున్నారు. ఒకవైపు మోదీ వ్యక్తి ఆరాధన సంస్కృతిని పెంచిపోషిస్తున్నప్పటికీ భగవత్ పట్టించుకోవడంలేదని కూడా సీనియర్ నాయకులు భావిస్తున్నారు. 2020 ఫిబ్రవరిలో సురేష్ జోషి (భయ్యాజి) హిందూమతంతో బీజేపీ సమానంకాదని హెచ్చరించారు. హిందువుల తరపున ఆర్ఎస్ఎస్ మాత్రమే మాట్లాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఆయన హెచ్చరిక ప్రభావం మోదీపైన ఏ మాత్రంలేదు. ఆధ్యాత్మిక లేదా సాంస్కృతిక ముసుగులో హిట్లర్, ముస్సోలినీ ఫాసిజంను అనుసరించలేదుగానీ మోదీ మాత్రం హిందుత్వ, జాతీయవాదం ముసుగులో ఫాసిజంను ఆచరిస్తున్నారు. ఆర్ఎస్ఎస్ మాత్రం ఇండియాను హిందూ రాష్ట్రంగా మార్చుచేయాలన్న ప్రణాళిక రూపొందించుకుంది. అయితే ఇది మోహన్ భగవత్‌కంటే గొప్పనాయకుడిగా తననుతాను మార్చుకునేందుకు వీలు కల్పించింది. ఆర్ఎస్ఎస్‌ను ఇష్టమైన నినాదంగా మార్చుకున్నారు. విచ్ఛిన్నకర రాజకీయాలను కొనసాగిస్తూనే ఉన్నారు. మోదీ తప్పులు చేస్తున్నప్పటికీ భగవత్ మౌనంగానే ఉంటున్నారు. ఆరు నెలలక్రితం భగవత్ వద్దకు బీజేపీ ఉన్నతస్థాయి నాయకులువెళ్లి మాట్లాడారు. మోదీ ఇష్టంవచ్చినట్లుగా చర్యలు సాగిస్తున్నారు. వాటిని అదుపుచేయండి అని హెచ్చరించినప్పటికీ వాటిని విస్మరించారు. మూడవసారి ప్రధానమంత్రి పదవిని మోదీకి ఇవ్వరాదని అనేకమంది సంఘ్ నాయకులు కోరుతున్నారని తెలుస్తోంది.

పలస్తీనా స్వేచ్ఛ కోసం గళమెత్తుదాం

డాక్టర్. సీ.ఎన్ క్షేత్రపాల్ రెడ్డి

ప్రపంచ వ్యాప్తంగా 'స్వతంత్ర పలస్తీనా', 'స్వేచ్ఛా గాజా' వంటి నినాదాల హోరు గట్టిగా వినిపిస్తోంది. యుద్ధోన్మాదం వద్దు -శాంతి ముద్దు అంటూ భారత్ సహా అమెరికా, బ్రిటన్, జర్మనీ లాంటి పశ్చిమ దేశాలకు చెందిన పౌరసమాజంతో పాటు వివిధ దేశాలు పలస్తీనా ప్రజల పక్షాన నిలిచి గొంతు సవరిస్తున్నాయి. తమను పాలించే పాలకులు అప్రకటితంగా ఇజ్రాయిల్ దుందుడుకు చర్యలను సమర్థిస్తూ, ఆ దురాక్రమణకు మద్దతు అప్రకటితంగా ఇస్తున్న ఆదేశాలకు వ్యతిరేకంగా ధిక్కార స్వరాలు వినిపిస్తున్నాయి.

ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు అతివాద పార్టీలతో జతకట్టి 2022లో అత్యంత మతఛాందస ప్రభుత్వాన్ని ఏర్పరచారు. పలస్తీనియన్లను చీదరించుకునే జాత్యహంకారులకు మంత్రి పదవులిచ్చిన ప్రతిఫలమే ప్రస్తుత యుద్ధ రక్కసి. ఇజ్రాయిల్ నరమేధంలో 4వేల మందికిపైగా పిల్లలు మరణించారు. పది నిముషాలకు ఒక పసికందు మృత్యువాత పడుతోందని ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకటించింది. ఇజ్రాయిల్ సైన్యం సృష్టించిన మారణహోమంతో ఆ ప్రాంతం పసిపిల్లల స్మశానంగా మారిందని ఐక్యరాజ్య సమితి వ్యాఖ్యానించిందంటే అక్కడి పరిస్థితి ఊహించవచ్చు. యుద్ధ నీతిని ఉల్లంఘించి బాధితులకు తాగునీరు, ఆహారం, వైద్య సేవలు, మందులు అందకుండా, విద్యుత్ సరఫరాను నిలిపివేసి అమానుషత్వానికి పాల్పడుతోంది. ఇది ఇజ్రాయిల్ పాపమే కాదు. ఆయుధ వ్యాపారమే ఆలంబనగా ఎదిగిన అమెరికాకూ భాగం ఉంది. యుద్ధాలను సృష్టించి వేల కోట్ల డాలర్ల ఆయుధ వ్యాపారం చేసుకోవడంలో ఆరితేరిన అమెరికా ఇప్పుడూ అదే పని చేస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా పలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న ముష్కర దాడులను నిరసిస్తూ తక్షణమే యుద్ధాన్ని నిలిపి వేయాలని డిమాండు చేస్తూ పలస్తీనా ప్రజలకు మద్దతుగా ప్రపంచ వ్యాప్తంగా సంఘీభావ ర్యాలీలు ఊపందుకున్నాయి. మునుపెన్నడూ లేనంతగా మోదీ ప్రభుత్వం నిర్బంధాలు విధిస్తున్నా ఆ సంకెళ్లను తెంచుకుంటూ దేశ వ్యాప్తంగా స్వేచ్ఛాయుత పలస్తీనా నిర్మాణం కోసం కోట్ల గొంతుకలు ఏకమయ్యాయి. మతం కన్నా మానవత్వం, శాంతి ప్రధానమని దేశమంతా నినదిస్తున్నాయి. కాల్పుల విరమణ చేయాలని, పలస్తీనా పౌరులందరికీ రక్షణ కల్పించాలని, తక్షణమే మానవతా సాయం చేయాలని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ చేసిన తీర్మానంపై ఓటింగ్‌కు కూడా భారత్ గైర్హాజరవడం పై విమర్శలు వెల్లువెత్తాయి.

ఇజ్రాయిల్‌లో పర్యటించిన మన తొలి ప్రధాని మోదీయే. ఆ పర్యటన పూర్తయిన కొద్ది రోజుల్లోనే అదానీ ఇజ్రాయిల్‌లో వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. ఇజ్రాయిల్‌లో మొత్తం రెండు ఓడ రేవులుండగా కీలకమైన హైఫా రేవు అదానీ పరమైంది. కాబట్టే అదానీ కోణంలోంచి, అమెరికా అనుకూల వైఖరితో ఇజ్రాయిల్‌ను సమర్థించే విధానాన్ని మోదీ తొలుత ఎంచుకున్నారనే విమర్శలొచ్చాయి. అయితే భారత్‌లో పౌరసమాజం బయటకు రావడం, ప్రత్యామ్నాయ మీడియా ద్వారా అసలు వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. దీని ఫలితమే తూర్పు జెరూసలేంలో పాటు ఆక్రమిత పలస్తీనా భూభాగం, ఆక్రమిత సిరియన్ గోలన్ హైట్స్ ప్రాంతాల్లో ఇజ్రాయిల్ సెటిల్‌మెంట్ కార్యకలాపాలను భారత్ ఖండించింది. వామపక్ష పార్టీలు ఏకంగా దేశ వ్యాప్తంగా కలిసి వచ్చే శక్తులను కలుపుకుని పలస్తీనా ప్రజలకు సంఘీభావ ప్రకటించే కార్యక్రమాలకు పిలుపునివ్వడం ముదావహం. బీజేపీతో పాటు వారితో అంటకాగుతున్న పార్టీలు తప్ప అన్ని పక్షాలు పలస్తీనియన్లకు మద్దతిస్తున్నారు. 'ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటించి భారతీయులు ఎంతగా మారిపోయారు' అని పలస్తీనా రచయిత్రి సుశాన్ అబుల్ హవా వేసిన ప్రశ్నకు...వలస వచ్చి, తిష్టవేసి, గాజాను నిర్మూలించడానికి కంకణం కట్టుకున్న ఇజ్రాయిల్ విధానాలను ఎన్నటికీ తాము సమర్థించబోమని భారత ప్రజలు చేతలతో సమాధానమిచ్చారు. ఈ నేపథ్యంలో పలస్తీనా సమాజానికి మద్దతుగా భారత్ ఐక్యరాజ్యసమితిలో ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానానికి అనుకూలంగా భారత్ ఓటు వేసింది.

అగ్రరాజ్యాల పాలకుల తీరు ఇజ్రాయిల్‌వైపు ఆ దేశాల పౌర సమాజం మాత్రం పలస్తీనాకు మద్దతుగా నిలుస్తోంది. గాజాలో ఇజ్రాయిల్ దాడి తరువాత లండన్, పారిస్, బెర్లిన్ వంటి పెద్ద నగరాల్లో ఇజ్రాయిల్ దురాక్రమణను నిరసిస్తూ భారీ ఆందోళనలు జరుగుతున్నాయి. ఇజ్రాయిల్ దాడి ప్రారంభించిన తొలినాళ్లలోనే బ్రిటన్ రాజధాని లండన్‌లో 30 వేలమంది యూదు వ్యతిరేక ర్యాలీ చేపట్టి తమ పాలకుల వైఖరిని తప్పుబట్టారు. పారిస్‌లోనూ లక్షమంది ప్రజలు గుమిగూడారు. పారిస్‌తో పాటు, స్ట్రాస్‌బర్గ్, నైస్, లియోన్ వంటి నగరాల్లో సంఘీభావ ర్యాలీలు జరిగాయి. పలస్తీనా ప్రజల సంక్షేమంకోరుతూ, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ విధానాలను ఖండిస్తూ వాషింగ్టన్‌లో భారీ కవాతు జరిగింది. కాల్పుల విరమణ జరిగేలా చూడాలని బైడెన్‌పై ఒత్తిడి పెరిగేలా ఫ్రీ పలస్తీనా నినాదంతో 'నేషనల్ మార్చ్ ఆన్ వాషింగ్టన్' పేరుతో రాజధాని నగరానికి ర్యాలీకి పిలుపునిచ్చారు. లాస్ ఏంజిల్స్, కాలిఫోర్నియాలోని అనాహైమ్‌లో పెద్ద ర్యాలీలు నిర్వహించారు. ఇల్లినాయిస్‌లోని ఇవాన్‌స్టన్, ఉత్తర చికాగో శివారులో వేలాది మంది ఇజ్రాయిల్ సృష్టించిన మారణ హోమాన్ని కళ్లకు కట్టిన ఫొటోలు, బ్యానర్లు చేతబట్టి నిరసన తెలిపారు. కెనడాలోని ప్రధాన నగరాల్లో వందల సంఖ్యలో నిరసనలు జరిగాయి. టొరంటో నగరంలో సుమారు 40వేలమంది విద్యార్థులు, కార్మికులు ఏకమై పలస్తీనాకు మద్దతుగా ర్యాలీ చేపట్టారు. కాలిఫోర్నియాలోని శాన్‌ఫ్రాన్సిస్కోలో, నార్ఫోక్, వర్జీనియాల్లోనూ ఈ ప్రదర్శనల జోరు కనిపించింది. పోర్ట్ ఆఫ్ ఓక్లాండ్‌లోని కార్మికులు ఇజ్రాయిల్ వెళ్లే సైనిక నౌకను నిలిపివేసి పలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలిపారు. డెట్రాయిట్ వేన్ స్టేట్ యూనివర్శిటీలో పెద్దఎత్తున విద్యార్థులు ర్యాలీకి హాజరయ్యారు. న్యూయార్క్‌లో ఇజ్రాయిల్ వ్యతిరేక ప్రదర్శనలు మిన్నంటగా ఇదులో వామపక్ష అమెరికన్ యూదు కార్యకర్తలే కీలక పాత్ర వహించడం గమనార్హం.

పలస్తీనియన్లకు సంఘీభావంగా ముస్లిందేశాలు ఏకమవుతున్నాయి. ఇరాక్‌లోని జోర్డాన్‌లోని సరిహద్దు ప్రాంతాల్లో వేలాదిమంది ప్రజలు ఇజ్రాయిల్ దురాక్రమణను నిరసించారు. టర్కీ రాజధాని అంకారా, ఇస్తాంబుల్ నగరంలోనూ పలస్తీనాకు మద్దతుగా ప్రజలు సమీకృతమవుతున్నారు. గాజాపై విధ్వంస వ్యూహాన్ని కొనసాగిస్తున్న ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుపై టర్కీ అధ్యక్షుడు రెసెఫ్ తయ్యిప్ ఎర్డోగాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ ఉగ్రవాద రాజ్యమని బహిరంగంగానే మండిపడ్డారు. దక్షిణాఫ్రికాలోని ఇండోనేషియా, మలేషియా, మొరాకో తదితర దేశాల్లోనూ సంఘీభావ ఉద్యమాలు ఊపందుకున్నాయి. కొలంబియాలోని ఇజ్రాయిల్ రాయబార కార్యాలయం, బీరుట్‌లోని యుఎస్ రాయబార కార్యాలయం సమీపంలోనూ భారీ ప్రదర్శనలు జరిగాయి. గ్రీస్, పాకిస్తాన్‌లలో కూడా పలస్తీనాకు మద్దతుగా భారీ ప్రదర్శనలు జరిగాయి. శ్రీలంక ప్రభుత్వం కూడా ఇజ్రాయిల్ చేస్తోన్న హింసను తక్షణమే నిలిపి వేయాలని పిలుపునిచ్చింది. ఈ నెల 13న లండన్‌లో పది లక్షల మందితో జరిగిన ప్రదర్శన ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఇది ప్రపంచదేశాల పౌరసమాజాన్ని మరోసారి పలస్తీనా కోసం గొంతెత్తేలా చేసింది. ఇటీవల భారత్‌లో జరిగిన క్రికెట్ వరల్డ్‌కప్ ఫైనల్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాకు చెందిన ఒక వ్యక్తి ఫ్రీ పలస్తీనా అని రాసిన టీ షర్టు ధరించి నరేంద్ర మోదీ స్టేడియంలోకి ప్రవేశించి మరీ తన ఆకాంక్షను వెల్లడించడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

మారణాయుధాలు విధ్వంసాన్ని, సంక్షోభాలను సృష్టిస్తాయే తప్ప శాంతిని, ప్రజల మధ్య సామరస్యాన్ని నెలకొల్పలేవు. అమాయకుల నెత్తుటితో నిత్యం తడిసిముద్దయ్యే నేలలో శాంతి ఉండదు. పశ్చిమాసియాలో యుద్ధకాష్టం ఆరాలంటే భారత్ సూచించినట్లు, శాంతి చర్చల ద్వారా గుర్తింపు పొందిన సరిహద్దులతో సార్వభౌమాధికారం కలిగిన స్వతంత్ర పాలస్తీనా కోసం గళమెత్తుదాం.

ఫోన్:9059837847

క్రికెట్ చూడ్డానికి వెళ్లిన ప్రధానికి
మణిపూర్ గుర్తు రాలేదా?

ప్రియాంకా గాంధీ

జైపూర్: ప్రపంచకప్ ఫైనల్‌లో టీమిండియా గెలిచినట్లయితే.. ఆ ఘనత నుంచి కొంతైనా రాజకీయ ప్రయోజనం పొందాలన్న ఆశతోనే ప్రధాని నరేంద్ర మోదీ ఫైనల్ మ్యాచ్ చూడ్డానికి అహ్మదాబాద్ వెళ్లారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వ్యాఖ్యానించారు. అయితే సంక్షోభ పరిస్థితి నెలకొన్నందునే మణిపూర్‌ను ఆయన సందర్శించలేదని చెప్పారు. రాజస్థాన్‌లోని జైపూర్ జిల్లాలో షాపురాలో జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ... ప్రధాని మోదీ తనను తాను ఫకీర్‌నని చెప్పుకుంటున్నా రని... మరి ఆయన పాలనలో బీజేపీ ధనిక పార్టీగా ఎలా అవతరించిందని ప్రశ్నించారు. దాదాపు ఏడు నెలలుగా జాతుల హింసతో మణిపూర్ అట్టుడుకు తున్నప్పటికీ ప్రధాని అక్కడికి వెళ్లకుండా... భారత్-ఆస్ట్రేలియా మధ్య క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్‌ను చూడటానికి అహ్మదాబాద్‌ను సందర్శిం చారని విమర్శించారు. ఏదైనా ప్రయోజనం ఉందనుకుంటేనే ఆయన ఎక్కడికయినా వెళతారని తెలిపారు. తన వైఫల్యాన్ని ఎత్తిచూపే ప్రాంతాన్ని వెళ్లరని ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తల రుణాలను మాఫీ చేసి... పేదలను విస్మరించాయని ప్రియాంక విమర్శించారు. రాజకీయాలతో మతాన్ని జోడించడం పాపమని ఆమె అన్నారు. కేంద్రం, బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు బడా పారిశ్రామికవేత్తల కోసం పనిచేస్తుండగా... రాజస్థాన్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం ద్వారా పేద ప్రజలకు ద్రవ్యోల్బణం నుండి ఉపశమనం కలిగించిందని ఆమె తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థులు మనీష్ యాదవ్, ఇంద్రజ్ గుర్జార్‌లకు మద్దతుగా జరిగిన బహిరంగ సభలో ప్రియాంక గాంధీ ప్రసంగించారు.

పెద్దన్నల కోసం ఎదురు చూపు

- తెలంగాణలో తారస్థాయికి ముఖ్యనేతల ప్రచారం
- నియోజకవర్గ స్థాయిలో పెద్ద నేతల ప్రచారంపై అభ్యర్థుల ఆశలు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం తారాస్థాయికి చేరింది. పోలింగ్ దగ్గర పడుతుండడంతో ముఖ్య నేతలంతా రోజుకు నాలుగైదు ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నారు. అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నేతలు నియోజకవర్గాలను చుట్టేస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు శ్రమిస్తున్నారు. ప్రధాన పార్టీలకు చెందిన స్టార్ క్యాంపెయినర్లు రాత్రింబవళ్లు అభ్యర్థుల తరపున గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఒకప్పుడు రాజధానికి చెందిన కొంత మంది నాయకులు తమ పార్టీలను ఒంటి చేత్తో ముందుకు నడిపించేవారు. వారి నియోజకవర్గాల్లో ప్రచారం చేసుకుంటూనే... పార్టీ అభ్యర్థుల తరపున కూడా ప్రచారం చేసేవారు. గెలుపు బాధ్యతలను భుజాన వేసుకుని అభ్యర్థులకు అండగా నిలిచేవారు. ప్రస్తుతం అలాంటివారు కనమరుగయ్యారు. మరోవైపు రాజధాని హైదరా బాద్‌లో తమను అదుకునే సీనియర్ నేతల కోసం అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.. సీనియర్ నేతలు వచ్చి తమ నియోజకవర్గంలో ప్రచారం చేస్తే బాగుంటుందంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నియోజకవర్గాల్లో... బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ కీలక నేతలు ఇంకా ప్రచారం ప్రారంభించ లేదు. సీనియర్లంతా తమ సొంత నియోజకవర్గాలకే పరిమితమయ్యారు. దీంతో బరిలో ఉన్న అభ్యర్థులు పార్టీలో పెద్దన్నల అండ కోసం ఆశగా ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆయా పార్టీల బాస్‌లు హైదరాబాద్ లో ప్రచారం చేస్తే బాగుం టుందని సొంత పార్టీ నేతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. బీఆర్ఎస్ లో మొదటి నుంచి నగరం మొత్తాన్ని ప్రభావితం చేసే నేతలు పెద్దగా లేరు. కీలక నేతగా ఉన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు కంటోన్మెంట్ సమన్వయ బాధ్యతల్ని కూడా పార్టీ అప్పగించింది. ఇక్కడ దివంగత ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందిత పోటీ చేస్తున్నారు. తలసాని ప్రచారానికి రాకపోవడంతో ఆమె ఒక్కరే ప్రచారం చేసుకుంటున్నారు. రంగారెడ్డి జిల్లాలో సబితా ఇంద్రారెడ్డి మహేశ్వరం నియోజకవర్గానికే పరిమితయ్యారు. మల్లారెడ్డి కూడా మేడ్చల్‌తోపాటు అల్లుడు పోటీ చేస్తున్న మల్కాజిగిరి నియోజకవర్గంలో ప్రచారం చేసుకుంటున్నారు. దీంతో నగరంలోని గులాబీ పార్టీ అభ్యర్థులకు మంత్రి కేటీఆర్ పెద్దదిక్కయ్యారు. కేసీఆర్ బహిరంగ సభలు ఎలాగూ ఉన్నాయి. వాటికి తోడు కేటీఆర్ రోడ్ షో కూడా ఉండాలని అభ్యర్థులు కోరుకుంటున్నారు. ఒకప్పుడు మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి, ఆ తర్వాత పి.జనార్దన్‌రెడ్డి లాంటి అగ్రనేతలు హైదరాబాద్ లో కాంగ్రెస్‌ను ఒంటి చేత్తో ముందుకు నడిపించారు. పార్టీ అభ్యర్థులకు అన్నీ తామై అండగా నిలిచారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఆ పరిస్థితి లేదు. నగరాన్ని పూర్తిగా ప్రభావితం చేసే నేతలు తమ పార్టీలో కనిపించడం లేదని సొంత పార్టీ నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. ఫలితంగా రాజధాని పరిధిలోని నియోజకవర్గాల్లో పోటీలో దిగిన అభ్యర్థులు... రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క లాంటి నేతలు ఎప్పుడు వస్తారా అని ఎదురు చూస్తున్నారు. హైదరాబాద్ నగరంలో బీజేపీకి ఒకప్పుడు ఆలె నరేంద్ర అన్ని తానై వ్యవహరించేవారు. పాతబస్తీలో పార్టీ బలోపేతం కోసం తీవ్రంగా కృషి చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నియోజకవర్గాల్లో తిరగాల్సి ఉన్నా... ఆశించిన స్థాయిలో తిరగడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఆయన రాష్ట్రవ్యాప్తంగా పర్యటించాల్సి వస్తుండటంతో హైదరాబాద్ లో ప్రచారం చేయలేకపోతున్నారని వాపోతున్నారు. బండి సంజయ్, ఈటల లాంటి నాయకులు తమ నియోజకవర్గాల్లో పర్యటించాలని గ్రేటర్ బీజేపీ నాయకులు కోరుతున్నారు. జాతీయ స్థాయి నేతలైన ప్రధాని మోదీ, అమిత్ షా, జేపీ నడ్డాతో పాటు రాష్ట్రంలోని కీలక నేతలు పర్యటిస్తే తమ గెలుపు అవకాశాలు మెరుగుపడతాయని భావిస్తున్న కమలం పార్టీ అభ్యర్థులు వారి కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రచారానికి ఎక్కువ సమయం లేకపోవడంతో ఆయా పార్టీల అభ్యర్థులు పార్టీ జాతీయ నాయకుల ప్రచారం పైనే ఆశలు పెట్టుకున్నారు.

కర్ఫ్యూ, అల్లర్లకు కాంగ్రెస్ చిరునామా

రాజస్తాన్ ఎన్నికల ప్రచారంలో సీఎం యోగి

జైపూర్: రాజస్తాన్‌లో అధికారం పొందడం కోసం బీజేపీ సాయశక్తులా ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ పథకాలను ఉచితాలుగా ఆరోపించిన బీజేపీ.. ఈ ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించేందుకు అవే హామీలు వల్లెవేస్తోది. ఇతర రాష్ట్రాల మంత్రులు, ముఖ్యమంత్రులను సైతం రంగంలోకి దింపి...విస్తృత ప్రచారం చేస్తోంది. ఇందులో భాగంగానే ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రాజస్తాన్‌లో పర్యటించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు వేయాలని ఆయన ప్రజలను కోరారు. ఇదే సమయంలో కాంగ్రెస్‌పై ఆరోపణలు గుప్పించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో మాఫియా పెచ్చుమీరిపోయిందని, కర్ఫ్యూ, అల్లర్లకు కాంగ్రెస్ ఓ చిరునామా అని ఆరోపించారు. రాజస్తాన్‌లో నిర్వహించిన ర్యాలీలలో సీఎం యోగి మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థులకు మద్దతివ్వాలని విన్నవించారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో అభివృద్ధి పనులు సాగకుండా మాఫియా అడ్డుకుంటోందని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లో ఇలాంటి పరిస్థితులు లేవని, అల్లర్లు ప్రేరేపిస్తే తీవ్ర పరిణామాలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. యూపీ అల్లరిమూకలు నరకానికి పయనమయ్యారని, వాళ్లు మళ్లీ మానవ లోకానికి తిరిగి రారని తెలిపారు. అత్యధిక విద్యుత్, పెట్రోల్, డీజిల్ ధరల భారంతో పాటు మరెన్నో సవాళ్లను రాష్ట్రం ఎదుర్కొంటోందని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కారుతోనే ఈ సమస్యలకు పరిష్కారమని తెలిపారు.

గెహ్లాత్ ప్రభుత్వాన్ని సాగనంపండి: మోదీ

జైపూర్: రాజస్థాన్‌ను అణచివేత, అవినీతి నుంచి విముక్తి చేయడానికి అశోక్ గెహ్లాత్ పభుత్వాన్ని తుడిచిపెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ంగార్‌పూర్ జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ దుష్టపాలనను అంత మొందించేందుకు ప్రజాస్వామ్యం రాజస్థాన్ ప్రజలకు అవకాశం ఇచ్చిందని, ఈ అవకాశాన్ని వదులుకోవద్దని కోరారు. 'కాంగ్రెస్‌ను తుడిచిపెట్టి, అల్లర్లు, నేరాలు, అవినీతి నుండి రాజస్థాన్‌ను విముక్తి చేయండి. కేంద్ర పథకాలను త్వరితగతిన అమలు చేయడానికి కాంగ్రెస్ నిష్క్రమణ కూడా అవసరం' అని ఆయన అన్నారు. రాజస్థాన్‌లో ప్రతి ప్రభుత్వ రిక్రూట్ మెంట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని మోదీ ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు, వారి సన్నిహితుల మధ్య ఇలాంటి వ్యాపారం జరుగుతోం దని... వారి పిల్లలు అధికారులు అవగా... మీ పిల్లలను తరిమికొట్టారని మోదీ పేర్కొన్నారు. గెహ్లాత్ ప్రభుత్వం రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి రాదని రాజస్థాన్ ప్రజలు గమనించాలని ఆయన అన్నారు. రాజస్థాన్‌లో నవంబర్ 25న ఎన్నికలు జరగనుండగా, డిసెంబర్ 3న ఫలితాలు వెలువడనున్నాయి.

ఒకే వేదికపై మోదీ, రాజే

రాజస్థాన్‌లో పోలింగ్‌కు ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే ఎన్నికల ప్రచారంలో ఒకే వేదికను పంచుకోవడం చర్చనీయాంశమైంది. రాజే, బీజేపీ అధిష్ఠానం మధ్య అంతా బాగానే ఉందని చెప్పడానికి చేసిన ప్రయత్నమని భావిస్తున్నారు. ఎన్నికలు నోటిఫికేషన్ వెలువడ్డాక ప్రధాని మోదీ, రాజే కలిసి పాల్గొన్న తొలి బహిరంగ సభ ఇది. రాష్ట్రంలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ స్థానాల్లో విజయం సాధిస్తే... ముఖ్యమంత్రి పదవి రేసులో ఉన్న వారిలో ఎమ్మెల్యే రాజే కూడా ఉన్నారు. బరన్ జిల్లా అంటాలో మంగళవారం జరిగిన సభలో రాజే... ప్రధాని మోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆయన 2024 లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి హ్యాట్రిక్ సాధించాలని దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారన్నారు. ప్రధాని మోదీ సత్తాను దేశం మొత్తం గుర్తిస్తోందని, ఇప్పుడు ప్రపంచం మొత్తం ఆయన నాయకత్వాన్ని అంగీకరిస్తోందని ఆమె చెప్పుకొచ్చారు. వేదికపైకి వచ్చిన ప్రధాని మోదీకి భారీ పూలమాల వేసి స్వాగతం పలికారు. మాజీ సీఎం రాజే, మోదీ ఇద్దరూ కలిసి ఒకే వేదికపై ఫొటోలకు ఫోజులిచ్చారు. ఆమె కుమారుడు, ఝలావర్-బరన్ ఎంపీ దుష్యంత్ సింగ్, పార్టీ స్థానిక అభ్యర్థులు ఈ సభలో పాల్గొన్నారు. ప్రధాని మోదీకి ఒకవైపు రాజే, మరోవైపు దుష్యంత్ కూర్చున్నారు.

అధికారంలోకి వస్తే కుల గణన

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

జైపూర్: రాజస్థాన్‌లో తమ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తే కుల గణన చేపడతామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ బుధవారం తెలిపారు. రాజస్థాన్‌లోని ధోల్‌పూర్‌లో ఎన్నికల సభను ఉద్దేశించి ప్రసంగించిన రాహుల్... అగ్నిపథ్ పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని నిందించారు. ఇది దేశాన్ని రక్షించాలనుకునే లక్షలాది మంది యువత కలలను ఛిన్నాభిన్నం చేసిందని అన్నారు. 'రాజస్థాన్‌లో అధికారాన్ని నిలబెట్టుకున్న తర్వాత కాంగ్రెస్ చేసే మొదటి పని కుల గణన. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ స్థాయిలో కూడా దీనిని నిర్వహిస్తాం' అని ఆయన చెప్పారు. దేశంలోని దళితులు, వెనుకబడిన తరగతులకు చెందిన ప్రజలు వారి వాస్తవ సంఖ్యను తెలుసుకోవలసినందున కుల గణన అవసరమని అన్నారు. 'ఈ రోజు దేశంలో సంపద ఎలా పంపిణీ చేయబడుతుందనేది పెద్ద ప్రశ్న. ఇంతకుముందు, ప్రధాని నరేంద్ర మోదీ తనను తాను ఓబీసీ అని చెప్పుకునేవారు. అయితే నేను కుల గణనను డిమాండ్ చేసిన వెంటనే, దేశంలో ఒకే కులం ఉందని, అది పేదలు అని ఆయన చెప్పుకొచ్చారు' అని గాంధీ అన్నారు. ప్రధాని మోదీ దృష్టి మళ్లించారని, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ జేబులు గుల్ల చేస్తున్నారని, కేంద్ర హోం మంత్రి అమిత్ షా లారీలు ఝుళిపిస్తున్నారని కాంగ్రెస్ నేత అన్నారు.

మళ్లీ అధికారంలోకి వస్తాం

- రాజస్తాన్‌లో మా 'మాయాజాలం' పని చేస్తుంది
- ఎవరు అదృశ్యమవుతారో మేం చెబుతాం: సీఎం అశోక్ గెహ్లాత్

జైపూర్: కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలనే 'మాయాజాలం' రాజస్థాన్‌లో పని చేస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ బుధవారం అన్నారు. నవంబరు 25న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన ఎన్నికల ర్యాలీలలో పదేపదే విమర్శలు చేస్తూ తనను 'మాంత్రికుడు' అని పిలవడంపై గెహ్లాత్ స్పందిస్తూ, 'మాయాజాలం' పని చేస్తుంది. ఆయన (కాంగ్రెస్) 'చూ మంతర్' (అదృశ్యం) అవుతారు. కానీ 'చూ మంతర్' ఎవరు అవుతారో (మేము) చెబుతాము' అని అన్నారు. కాగా, గెహ్లాత్ చిన్నతనంలో మెజిషియన్ (మాంత్రికుడు) అయిన తన తండ్రితో ప్రదర్శనలకు వెళ్లేవాడు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాట్లాడుతూ ఉదయ్‌పూర్‌లో కన్హయ్య లాల్ హత్య కేసులో నిందితులు బీజేపీతో 'సంబంధం' కలిగి ఉన్నారని, వారిని ఉరి తీయాలని అన్నారు. అయితే ఎన్ఐఏ ద్వారా దర్యాప్తు ముందుకు సాగడం లేదని తెలిపారు. రాష్ట్రంలో పార్టీ అవకాశాలు, 'రెడ్ డైరీ' అంశం, ఎన్నికల హామీల గురించి కూడా మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో బీజేపీ లేవనెత్తిన రెడ్ డైరీ సమస్యను 'అర్థం లేనిది'గా గెహ్లాత్ అభివర్ణించారు. వారి ఆరోపణలలో ఏదైనా వాస్తవం ఉంటే, డైరీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఆదాయపు పన్ను శాఖ లేదా సీబీఐకి అప్పగించాలన్నారు. 'రెడ్ డైరీ'లో గెహ్లాత్ ప్రభుత్వం చేసిన ఆర్థిక అవకతవకల వివరాలు ఉన్నా యని తొలగించబడిన మంత్రి ఒకరు ఆరోపించారు. కన్హయ్య లాల్ హత్య కేసును ఎన్నికల అంశం చేసేం దుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టారు. నిందితులకు బీజేపీతో సంబంధాలు ఉన్నాయని, ఎన్నికల దృష్ట్యా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చేస్తున్న దర్యాప్తు ఆలస్యమైందని పేర్కొన్నారు. నిందితులను ఇప్పటికే ఉరితీసి ఉండాల్సిందని ఆయన అన్నారు. 'ఎన్నికలు వస్తున్నందున (విచారణ) ఆలస్య మైందని నేను అనుకుంటున్నాను. వారు (బీజేపీ) దాని గురించి మాట్లాడుతున్నారు. అందుకే ఎన్ఐఏ ఉండాల్సిన రీతిలో ముందుకు సాగడం లేదన్నది నా సందేహం' అని తెలిపారు. నిందితులను గతంలో వేరే కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, అయితే బీజేపీ వారిని విడుదల చేసిందని ముఖ్యమంత్రి ఆరోపిం చారు. నిందితులను రాజస్థాన్ పోలీసులు రెండు గంటల్లో అరెస్టు చేశారని, అయితే కేసును ఎన్ఐఏ స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ ఘటన అనంతరం మతపరమైన అల్లర్లు జరగకుండా బీజేపీ, కాంగ్రెస్ నేతలు కలిసి పని చేస్తారని తాను ఊహించా నని అన్నారు. గెహ్లాత్ తన కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకుని, కేసుపై దృష్టి కేంద్రీకరించినప్పుడు బీజేపీ నాయకులు హైదరాబాద్‌లో తమ సమావేశానికి హాజర య్యేందుకు ఎంచుకున్నారు. ప్రస్తుతం అసోం గవర్నర్‌గా ఉన్న గులాబ్ చంద్ కటారియా అసెంబ్లీ నియోజకవర్గంలో ఈ ఘటన జరిగిందని, అయితే బీజేపీ నేతలు కార్యక్రమాన్ని రద్దు చేయకుండా హైదరాబాద్‌కు వెళ్లారని ఆయన అన్నారు. ఇప్పుడు ఎన్ఐఏ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పడం లేదని కన్హయ్య లాల్ కుటుంబం చెబుతోంది. బీజేపీ నాయకుడు నుపుర్ శర్మ వివాదాస్పద సోషల్ మీడియా పోస్ట్‌కు మద్దతు ఇచ్చినందుకు కన్హయ్య లాల్ అనే టైలర్, గత సంవత్సరం ఉదయ్‌పూర్‌లోని అతని దుకాణంలో కత్తి పోట్ల కారణంగా హత్యకు గుర య్యాడు. ఈ పోస్ట్‌ను ఇస్లాం మతాన్ని అవమానించి నట్లుగా భావించారు. ఎన్నికల పరిస్థితి, క్షేత్రస్థాయిలో ఉన్న అంచనాల గురించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ '200 సీట్లలో దాదాపు 150 సీట్ల నుంచి (నా పర్యటన కోసం) డిమాండ్ వస్తోంది. నేను అన్ని ప్రాంతాలకు రాలేనని చెబుతున్నాను. (ప్రజలు) నేను అన్ని స్థానాల్లో ఎన్నికలలో పోటీ చేస్తున్నట్లుగా పరిగణించాలి' అని తెలిపారు. కొన్ని స్థానిక సమస్యలు లేదా ఫిర్యాదులు ఉండవచ్చు. కానీ రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ప్రజలు వాటిని విస్మరించి కాంగ్రెస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్నారు. 'స్థానిక స్థాయిలో చిన్న చిన్న లోపాలు ఉండవచ్చు. రాజకీయాల్లో స్థానిక సమస్యలు కొనసాగుతున్నందున స్థానిక ఎమ్మెల్యే లేదా అభ్యర్థికి ఫిర్యాదు ఉండవచ్చు. వాటన్నింటినీ విస్మరించండి. రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రభుత్వాన్ని పునరావృతం చేయండి. ఏ పని చేసినా రానున్న కాలంలో మరింత పటిష్టంగా పని చేస్తాం. ఈ పథకాలను బలోపేతం చేసి కొత్త పథకాలు తీసుకువస్తాం' అని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇవి లోక్‌సభ ఎన్నికలు కాదని, అసెంబ్లీ ఎన్నికలని గుర్తించి, మోదీ ముఖం మీద బీజేపీ ఎందుకు ఎన్నికల్లో పోటీ చేస్తోందని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. 'ఈ ఎన్నికలు పార్లమెంటు కోసం జరగ డం లేదు. అసెంబ్లీ కోసం జరుగుతున్నాయి. ప్రధాని ముఖం మీద ఎన్నికల్లో పోటీ చేయాల్సిన దుస్థితి వారికి ఎందుకు వచ్చింది. ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది?. మోదీ ముఖంపై పోరాడాలనే తపన బీజేపీకి ఎందుకు ఎదురవుతోంది? అని ప్రశ్నించారు. ద్రవ్యోల్బణం, అధిక ఇంధన ధరలకు రాజస్థాన్ బాధ్యత వహించా లంటూ ప్రధాని చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. ప్రధాని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించిన గెహ్లాత్... రాజస్థాన్, మధ్య ప్రదేశ్‌లలో ఒకే విధమైన పరిస్థితులు, విధానం ఉన్నందున రాజస్థాన్‌లోని ఇంధన ధరలను ఉత్తర ప్రదేశ్, హరియానాకు బదులుగా బీజేపీ పాలిత మధ్య ప్రదేశ్‌తో పోల్చాలని అన్నారు. రాష్ట్రంతో పంచుకునే ప్రాథమిక ఎక్సైజ్ సుంకాన్ని కేంద్రం తగ్గిం చిందని, రాష్ట్ర వాటా లేని అదనపు ఎక్సైజ్ సుంకం, ప్రత్యేక ఎక్సైజ్ సుంకం, సెస్ విధించిందని, అందువల్ల ఆదాయం కేంద్రానికి వెళుతుందని సీఎం గెహ్లాత్ చెప్పారు. కాంగ్రెస్ ఏడు హామీలు ఇస్తుంటే, మోదీ తన హామీపై ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. మోదీ హామీ ఇక్కడ పని చేయదని తెలిపారు. 'ఆయన నవంబరు 23 వరకు మాత్రమే రాజస్థాన్‌లో ఉంటాడు. ఐదేళ్ల వరకు రాడు. ఆ పని రాజస్థాన్ నాయకులైన మనమే చేయాలి. అందువల్ల ఆయన ఏమి హామీ ఇస్తున్నాడు?' అని ప్రశ్నించారు. 'హామీ మాది, దానిపై చర్చ. మా పథకం క్షేత్రస్థాయిలో ప్రభావవంతంగా ఉందో లేదో వారు చర్చించుకోవాలి. ఆమోదించిన చట్టాలలో ఏముందో చెప్పండి. రాజస్థాన్‌లో దీనిపై చర్చ జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు' అని అన్నారు. రాజస్థాన్‌లోని 200 అసెంబ్లీ స్థానాలకు గాను 199 స్థానాలకు నవంబరు 25న పోలింగ్ నిర్వహించి డిసెంబరు 2న ఫలితాలు వెలువడనున్నాయి. శ్రీగంగానగర్‌లోని కరణ్‌పూర్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి గుర్మీత్ సింగ్ కూనార్ మృతి చెందడంతో పోలింగ్ వాయిదా పడింది.

30 ఏళ్ల సంప్రదాయం మారుస్తాం

మళ్లీ కాంగ్రెస్‌దే అధికారం: పైలట్

జైపూర్: రాజస్తాన్‌లో 30 ఏళ్లుగా ఎన్నికల్లో వరుసగా ఎందుకు గెలవలేకపోతున్నామో ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ డిప్యూటీ సీఎం సచిన్ పైలట్ వ్యాఖ్యానించారు. ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పైలట్ మాట్లాడుతూ రాజస్తాన్‌లో 30 ఏళ్లుగా వరుసగా ఎన్నికల్లో గెలుపొందలేదు. దీనికి కారణమేమిటి అనే దానిపె ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ ఈ సంప్రదాయానికి స్వస్తి చెబుతుంది. రాజస్తాన్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచితీరుతుందని పైలట్ ధీమా వ్యక్తం చేశారు. సామాజిక సంక్షే మం, పెట్టుబడులు, సంపద సృష్టిపై దృష్టి పెట్టామని, అసమాతనలు లేని రాజస్తాన్ కావా లని, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాల న్నారు. బీజేపీ 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వంపై మండిపడ్డారు. రాష్ట్ర అగ్ర నాయకత్వం మధ్య విభేదాలపై స్పందిస్తూ తాము సమిష్టిగా ఎన్నికల్లో పోరాడతామని, ఇక పదవులు ఎంపిక అధిష్ఠానం చూసుకుంటుందని వ్యాఖ్యానించారు. పార్టీ అధినేత మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సలహా మేరకు తాను 'క్షమించండి, మరచిపోయి ముందుకు సాగండి' ఈ మంత్రాన్ని అనుసరిస్తున్నట్లు పైలట్ తెలిపారు. అశోక్ గెహ్లాత్‌ని ఉద్దేశించి గతంలో చేసిన వ్యాఖ్యలపై మాట్లాడుతూ గతంలో తానేం మాట్లాడినా దానికి బాధ్యత వహిస్తానని, రాజకీయ చర్చల్లో గౌరవాన్ని కాపాడుకోవాలని పేర్కొన్నారు. రాజస్తాన్‌లో ఒకసారి బీజేపీ పైచేయి సాధిస్తే, తదుపరి ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారాన్ని చేజిక్కించుకుంటోంది. ఇపుడు రాజకీయ విశ్లేషకులు ఈ లెక్కల్ని నిశితంగా గమనిస్తున్నారు. రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలకు ఈ నెల 25న పోలింగ్ జరగనుండగా డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనుంది.

ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే

బీహార్ కేబినెట్ తీర్మానం

పాట్నా: బీహార్‌కు ప్రత్యేక హోదా కల్పించాలన్న డిమాండ్‌కు మద్దతుగా ముఖ్య మంత్రి నితీశ్‌కుమార్ మరో ముందడుగు వేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలన్న తీర్మానానికి ఆ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. బుధవారం మంత్రివర్గ సమావేశం అనంతరం సోషల్ మీడియా వేదికగా సీఎం నితీశ్ ఈ విషయాన్ని వెల్లడించారు. దీంతో పాటు కులగణనలో నిరుపేదలుగా తేలిన 94 లక్షల కుటుంబాల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు 50 శాతం నుంచి 65 శాతానికి పెంచుతున్నట్లు గుర్తు చేశారు. 'బీహార్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాలని కేంద్రాన్ని కోరుతూ రాష్ట్ర కేబినెట్ తీర్మా నాన్ని ఆమోదిం చింది. 94లక్షల నిరుపేద కుటుంబాల్లోని ప్రతి ఒక్కరికీ దశలవారీగా రూ.2లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తాం. గుడిసెల్లో నివసించే 39 లక్షల కుటుంబాలకు పక్కా ఇళ్లు నిర్మిస్తాం. అందుకోసం రూ.1,20 లక్షలు ఇస్తాం. స్థలం లేని కుటుంబాల కోసం తొలుత రూ.60వేలు ఇవ్వాలని అనుకున్నాం. దానిని ఇప్పుడు లక్ష రూపాయాలకు పెంచాలని నిర్ణయించాం. దీని వల్ల 63,850 మందికి ప్రయోజనం చేకూరుతుంది. ఈ పథకాల అమలుకు సుమారు రూ.2.50 లక్షల కోట్లు అవుతుందని అంచనా. వీటిని ఐదేళ్ల లోపు అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. కానీ, ప్రత్యేకహోదా ఇస్తే... వీటిని పూర్తి చేయడానికి తక్కువ సమయం పడుతుంది. మా డిమాండ్‌ను పరిశీలించేం దుకు ఆర్బీఐ గవర్నర్ మాజీ రఘురాం రాజన్ నేతృత్వం లో ఓ కమిటీని ఏర్పాటు చేసింది కేంద్రం. 2017లో ఆ కమిటీ నివేదిక ఇచ్చినా ఏం ప్రయోజనం లేదు. బీహార్‌కు ప్రత్యేకహోదా ఇవ్వాలని కేంద్రాన్ని మరోసారి కోరుతున్నాం. బీహార్ ప్రజల అవసరాల దృష్ట్యా మా డిమాండ్‌కు ఆమోదం తెలపాలని కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నాం' అని నితీశ్ పేర్కొన్నారు. గతేడాది వరకు బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని నడిపిన నితీశ్ కుమార్... ఆ పార్టీతో తెగదెంపులు చేసుకుని ఎన్డీఏ నుంచి బయటకు వచ్చారు. అనంతరం ఆర్జేడీతో కలిసి ప్రభుత్వా న్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వా త విపక్ష కూటమి ఇండియా ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు.

విశాఖలో లారీని ఢీకొట్టిన ఆటో

- 8 మంది పాఠశాల విద్యార్థులకు గాయాలు
- వారిలో ఇద్దరి పరిస్థితి విషమం
- డ్రైవర్ ఆటోను వేగంగా నడపటమే కారణం

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విశాఖలో రెండు వేర్వేరు ఘటనల్లో స్కూల్ పిల్లలను తీసుకువెళుతున్న ఆటోలు ప్రమాదానికి గురయ్యాయి. అనేక మంది విద్యార్థులు గాయపడ్డారు. నగరంలోని సంఘం శరత్ థియేటర్ జంక్షన్ వద్ద పాఠశాల విద్యార్థుల ఆటో లారీని ఢీ కొట్టింది. ఈ సంఘటన తీవ్ర ఆందోళన కలిగించింది. పాఠశాల సమయం దాటిపోతుందేమోనని డ్రైవర్ ఆటోను వేగంగా నడిపి లారీని ఢీ కొట్టిన ఘటనలో 8 మంది విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో నలుగురు బాలికలు, నలుగురు బాలురు ఉన్నారు. ఈ ఆటో బుధవారం ఉదయం 7.30 గంటల సమయంలో రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ మీదుగా వచ్చే రహదారిలో సంఘం శరత్ థియేటర్ జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్ అతివేగం కారణంగా లారీ ఢీకొని ఆటో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో 8 మంది చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన చిన్నారులను సంఘటనా స్థలంలో ఉన్న వారే హుటాహుటిన సెవెన్ హిల్స్ ఆస్పత్రికి, రైల్వే ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులకు తలకు బలమైన గాయాలు కావడంతో వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులు బేతని స్కూలు విద్యార్థులుగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనలో లారీ డ్రైవర్, క్లీనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గురైన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి. వాణి జయరాం (8వ తరగతి), అలహరి హాసిని ప్రియ (10వ తరగతి), గణిత గాయత్రి (9వ తరగతి), సోదరి లక్ష్య (4వ తరగతి), చార్విక్ (4వ తరగతి), కేయూష్, కుషల్ (ఒకటో తరగతి), భావేశ్ (7వ తరగతి) ఉన్నారు. వీరిలో అలహరి హాసిని ప్రియకు తలకు తీవ్ర గాయమైంది. దీంతో ఆమెకు వైద్యులు ఆపరేషన్ చేశారు. తల్లిదండ్రులు హుటాహుటిన ఆస్పత్రికి చేరుకొని శోక సముద్రంలో మునిగిపోయారు. నలుగురు విద్యార్థులు ప్రాథమిక చికిత్స పొందిన తర్వాత డిశ్చార్జ్ అయ్యారు. స్కూలుకు సమయం అవుతుందని ఆటో డ్రైవర్ వేగంగా నడిపారని, అదే వేగంతో వస్తున్న లారీని గమనించలేదని గాయపడిన చిన్నారులు తెలిపారు. ఈ సంఘటనపై డీసీపీ-1 శ్రీనివాసరావు మాట్లాడుతూ స్కూల్ పిల్లల ఆటోల ప్రమాదం బాధాకరమని, ఆటో డ్రైవర్ల అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని సీసీ ఫుటేజ్ ద్వారా తెలుసుకున్నట్లు చెప్పారు. సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం పరామర్శించి, వారి తల్లిదండ్రులకు మనోధైర్యాన్ని నింపారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి ఆస్పత్రికి చేరుకుని గాయపడిన చిన్నారులకు మెరుగైన వైద్య సదుపాయం అందించాలని, అందుకు అవసరమైన ఖర్చంతా ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. మేయర్ హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి తదితరులు పిల్లల తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు.

నగరం పాలెంలో మరో ఆటో బోల్తా... ఏడుగురు చిన్నారులకు గాయాలు

మరోపక్క విశాఖలో మరో సంఘటన కూడా చోటుచేసుకుంది. నగర శివార ప్రాంతమైన మధురవాడ, నగరం పాలెం రోడ్డులో స్కూల్ ఆటో బోల్తా పడింది. ఈ ఆటోలో ఏడుగురు స్కూల్ పిల్లలు ప్రయాణిస్తున్నారు. పిల్లలకు, ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పంది అడ్డురావడంతో అదుపుతప్పి ఆటో బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. తృటిలో పెను ప్రమాదం తప్పిందని, స్వల్ప గాయాలైన చిన్నారులను స్థానిక ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు.

మెడికోల గ్యాంగ్‌వార్‌పై సమగ్ర విచారణ

రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఏపీలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టాలని, ఒంగోలు రిమ్స్ వైద్య కళాశాలలో విద్యార్థుల గ్యాంగ్‌వార్‌పై సమగ్ర విచారణ జరపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒంగోలు రిమ్స్ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థులు రోడ్లపై, తరగతి గదుల్లో విచక్షణారహితంగా దాడులు చేసుకున్న ఘటన ఏపీలో మత్తుపదార్థాలు, మద్యం వినియోగం పెరిగిందనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఏడాది కాలంగా రిమ్స్‌లో మాదకద్రవ్యాల గొడవలు జరుగుతున్నప్పటికీ పోలీసులు చోద్యం చూడటం విచారకరమన్నారు. కర్నూలు వైద్య కళాశాలలో విద్యార్థుల వద్ద గంజాయి లభించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి నాసిరకం మద్యం వినియోగం, విక్రయాలు భారీగా పెరిగాయని తెలిపారు. దీంతోపాటు మత్తు పదార్థాల వాడకం పెరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని పేర్కొన్నారు. సాక్షాత్తూ వైద్య విద్యాలయాల్లో మాదకద్రవ్యాలు, గంజాయి వినియోగం కలకలం రేపుతోందన్నారు. మాదకద్రవ్యాల వల్ల విద్యార్థులు, యువత చెడువ్యసనాలకు బానిసలై, వారి భవిత ఛిద్రమయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, గంజాయి సాగును అరికట్టడంలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఘోరంగా విఫలమైనట్లు విమర్శించారు. ఆరోగ్య పరిరక్షణ కోసం కృషిచేస్తూ సమాజంలో ఉన్నతులుగా తీర్చిదిద్దబడాల్సిన వైద్య విద్యార్థులే మత్తుపదార్థాలకు బానిసలై, అనారోగ్య హేతువులుగా మారడం శోచనీయమన్నారు. ఒంగోలు రిమ్స్ వైద్య కళాశాల విద్యార్థుల గ్యాంగ్‌వార్, కర్నూలు వైద్య కళాశాల విద్యార్థుల గంజాయి సేవనం ఘటనలపై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మిగిలింది 12 మీటర్లే...

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్, ఉత్తరకాశీ సొరంగంలో చిక్కుకున్న 41 మంది కార్మికులను రక్షించేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. కార్మికులను చేరుకునేందుకు ఇంకా 12 మీటర్ల దూరమే మిగిలివున్నది. ఈ మేరకు ఉత్తరాఖండ్ రోడ్డు, రవాణా శాఖ సీనియర్ అధికారి మెహమూద్ అహ్మద్ తెలిపారు. మరో ఆరు మీటర్లు ముందుకు వెళ్లగలగడం సంతోషంగా ఉందన్నారు. పని దాదాపు ముగింపుకు చేరుకున్నట్లే అని ప్రత్యేక అధికారి భాస్కర్ ఖుల్బే అన్నారు. 67శాతం డ్రిల్లింగ్ పూర్తి అయిందని తెలిపారు. 41 మంది కార్మికుల కోసం ఇప్పటికే మూడు అంబులెన్స్‌లు చేరుకున్నాయి. మరో 35 అంబులెన్స్‌లు త్వరలో చేరుకోనున్నట్లు అధికారులు చెప్పారు. ఆక్సిజన్ సిలిండర్లు, మాస్క్‌లు, అన్ని మెడికల్ సపోర్ట్ మెషీన్లు అందుబాటులో ఉంచారు. శిథిలాల నుంచి 53 మీటర్ల మేర చొప్పించిన ఆరు అంగుళాల పైప్‌లో.. వాకీటాకీలు జత చేసిన ఎండోస్కోపీ కెమెరాతో రికార్డు చేసిన వీడియోను ఇప్పటికే విడుదల చేశారు. తామంతా క్షేమంగానే ఉన్నట్లు వాకీటాకీలో కార్మికులు తెలిపారు. ప్రధాని మోదీ ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామికి ఫోన్ చేసి సహాయక చర్యల పురోగతిని తెలుసుకున్నారు. అయితే త్వరలోనే కార్మికులంతా సురక్షితంగా బయటకు వస్తారని అధికారులు ఆకాంక్షించారు.

విద్య కాషాయీకరణకు బీజేపీ కుట్ర

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర, హైదరాబాద్: హైస్కూల్ స్థాయిలో పాఠ్యాంశాలలో రామాయణం, మహాభారతాన్ని చేర్చాలని ఎన్‌సీఈఆర్‌టీ కమిటీ సూచించడాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ తప్పుబట్టారు. క్రమంగా మనుధర్మ శాస్త్ర ప్రకారం విద్యా వ్యవస్థను మార్చేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జాతీయ విద్యా విధానాన్ని తీసుకువచ్చిందని, దానికి అనుగుణంగానే ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్ మారుస్తున్నారని విమర్శించారు. దేశ భక్తి లేకనే విద్యార్థులు విదేశాలకు వెళ్లిపోతున్నారంటూ... సామాజిక శాస్త్రాలు, చరిత్ర పాఠాలలో రామాయణం, మహా భారతం చేర్చడం ద్వారా విద్యార్థులలో దేశ భక్తి పెరిగి వారు ఇక్కడే ఉంటారని ఎన్‌సీఈఆర్‌టీ కమిటీ పేర్కొడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థులు విదేశాలకు వలసపోవడానికి కారణం దేశ భక్తి లేక కాదని... ఇక్కడ అవకాశాలు లేకనే అని స్పష్టం చేశారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలన్న రాజ్యాంగ లక్ష్యాలకు భిన్నంగా పురాణాలను చరిత్రలో భాగం చేసి, దేశాన్ని తిరోగమనంలోకి తీసుకెళ్తున్నారని నారాయణ విమర్శించారు. అలాగే ఇండియాకు బదులుగా భారత్ అనే పేరును పాఠ్యాంశాలలో చేర్చాలనే ఎన్‌సీఈఆర్‌టీ సూచనను కూడా నారాయణ తప్పుబట్టారు. ఇండియా, భారత్ అనేది రాజకీయ పరమైన అంశమైని, దీనిని పాఠ్యాంశాలలో జొప్పించడమేమిటని ప్రశ్నించారు. ప్రతిపక్షాల కూటమికి ఇండియా అని పేరు ఉన్నందునే, ఇండియాకు బదులు భారత్ అని వాడాలని ఒత్తిడి తీసుకువస్తున్నట్లుగా ఉన్నదన్నారు. విద్యా వ్యవస్థలో కీలక స్థానాలైన యూజీసీకి ఛైర్మన్‌గా ఉన్న జగదీశ్, ఎన్‌సీఈఆర్‌టీ కమిటీ ప్యానల్ ఇసాక్ వంటి వారంతా ఆర్‌ఎస్‌ఎస్ నేపథ్యం ఉన్నవారేనని, వారంతా ఆర్ ఎస్ ఎస్, కేంద్రం ఆదేశాలకు అనుగుణంగానే చరిత్రను మార్చేందుకు ప్రణాళికాబద్ధంగా కుట్రలో భాగమవుతున్నారని నారాయణ మండిపడ్డారు. తక్షణమే వాస్తవిక చరిత్రకు భిన్నంగా చరిత్ర పాఠ్యాంశాలలో మార్పులు చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

చంద్రబాబు బెయిల్‌పై విచారణ వాయిదా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మద్యం, ఇసుక కేసుల్లో టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా పడింది. రెండు వర్గాల వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం మద్యం కేసులో చంద్రబాబు, కొల్లు రవీంద్ర ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణను గురువారానికి, ఇసుక పాలసీ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. కాగా ఇసుక కేసులో తదుపరి వాదనలను అడ్వకేట్ జనరల్ వినిపించనున్నారు. రెండు కేసుల్లోనూ చంద్రబాబు తరపు న్యాయవాదుల వాదనలు పూర్తయ్యాయి. సీఐడీ అభియోగాలపై ఆధారాలు లేవని వారు వాదించారు. రాజకీయ కక్షతోనే వరుస కేసులు నమోదు చేస్తున్నారంటూ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 17ఏ నిబంధన చంద్రబాబుకు వర్తిస్తుందన్నారు. అభియోగాలు నమోదుకు గవర్నర్ అనుమతి తీసుకోలేదన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని క్రిమినల్ కేసు ద్వారా విచారణ జరపరాదని చంద్రబాబు తరపు న్యాయవాదులు వాదించారు. ఉచితంగా ఇసుకను ఇచ్చారు కాబట్టి ఖజానాకు నష్టం జరిగిందని అనడానికి వీల్లేదన్నారు. అది ప్రభుత్వ నిర్ణయం, సామాన్యులకు మేలు చేయాలనే ఉద్దేశంతో చేసిన నిర్ణయంగానే చూడాలని కోరారు. ప్రభుత్వ విధానపర నిర్ణయాన్ని తప్పుపట్టేందుకు ఏముంటుందని ప్రశ్నించారు. ఉచిత ఇసుక అనేది ఏ విధంగానూ చట్ట విరుద్ధం కాదని వాదించారు. ఇసుక ధరలు ఆకాశాన్ని అంటుతున్న సమయంలో పేదలకు, భవన నిర్మాణ పనులకు అందుబాటులో ఉండేలా అప్పటి ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇవ్వాలని ఈ విధానపరమైన నిర్ణయం తీసుకుందని కోర్టుకు విన్నవించారు. చంద్రబాబు అధికారాన్ని దుర్వినియోగించారని మద్యం కేసులో సీఐడీ తరపు న్యాయవాది వాదించారు. కేబినెట్ నిర్ణయానికి విరుద్ధంగా విధాన నిర్ణయం తీసుకున్నారని, దాని వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం వచ్చిందన్నారు. కేబినెట్ నిర్ణయం ప్రకారం వెళ్లాలి లేదా సవరించి ముందుకు వెళ్లాలని, అలా కాకుండా వెళితే అవినీతి విస్తృతం అవుతుందని వివరించారు. ఎక్సైజ్ విధానాన్ని ఐదు నుంచి 10 శాతానికి ఉద్దేశ పూర్వకంగా మార్చారని, కొంతమందికే లబ్ధి కలిగేలా మార్పులు చేసి లైసెన్స్ ఇచ్చారని సీఐడీ తరపు న్యాయవాదులు వాదించారు. ఎక్సైజ్ విధానాన్ని నాటి ప్రతిపక్షంగా ఉన్న వైసీపీ వ్యతిరేకించలేదని, దానివల్ల ప్రజలకు ఎటువంటి నష్టంలేదని చంద్రబాబు తరపు న్యాయవాదులు వాదించారు. రెండు వర్గాల వాదనలు విన్న కోర్టు తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేస్తూ ఆదేశాలిచ్చింది.

కార్మికుల భద్రత పట్టదా?

సొరంగం కూలిన ఘటన ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం

కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక

న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్, ఉత్తరకాశీలో సిల్క్‌యారా సొరంగం కూలిపోయి 41 మంది కార్మికులు చిక్కుకుపోవడంపై కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. కార్మికుల భద్రత, వారి ఆరోగ్య సంరక్షణ పట్టదా అని ప్రభుత్వాన్ని నిలదీసింది. సొరంగం కూలిన ఘటనకు బాధ్యత తీసుకోవడంలోనూ అధికారులు విఫలమైనట్లు దుయ్యబట్టింది. కార్మికులకు పనిభద్రత, ఆరోగ్యానికి రక్షణ కల్పించడంలో ప్రభుత్వం ఎంతో నిర్లక్ష్యంగా ఉందని తాజా ఘటనతో స్పష్టమైందని వ్యాఖ్యానించింది. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్‌ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఎస్‌ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీతో పాటు కార్మిక సమాఖ్యల ఐక్యవేదిక ఈ మేరకు ఉమ్మడి ప్రకటనను మంగళవారం విడుదల చేసింది. పనిప్రదేశాల్లో కార్మికులకు భద్రత చట్టాల్లోని డొల్లతనం ఇలాంటి ఘటనలతో బహిర్గతమవుతున్నట్లు పేర్కొంది. 41 మంది కార్మికులు సొరంగం లోపల చిక్కుకుపోవడంపై ఆందోళన వ్యక్తంచేసింది. ఇది జీవన్మరణ పరిస్థితి అని, సహాయక చర్యల కోసం కేంద్ర బృందం ఆలస్యంగా చేరుకోవడాన్ని దుయ్యబట్టింది. 'పొడవాటి సొరంగాలను నిర్మించేటప్పుడు అత్యవసర పరిస్థితుల్లో తప్పించుకునేందుకు మార్గాలను ఏర్పాటు చేయాలని కూడా ఆలోచించడం లేదని కార్మికులు అంటున్నారు. సొరంగాలు తవ్వేటప్పుడు కార్మికుల భద్రత గురించి కంపెనీలుగానీ ఏజెన్సీలుగానీ పట్టించుకోవడం లేదని నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. న్యూ ఆస్ట్రియన్ టన్నెలింగ్ పద్ధతి ప్రకారం నిర్మాణాలు జరగడం లేదు. సొరంగాల్లో వెలువడే విషవాయువులను బయటకు పంపేందుకు మార్గాలు లేకపోవడంపై నిపుణుల నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది. గతంలో ఏర్పాటు చేసిన హ్యూమ్ పైపులను సొరంగం నిర్మాణం పూర్తి కాక ముందే తొలగించినట్లు కార్మికులు ఇంతకుముందే ఫిర్యాదు చేశారు' అని ప్రకటన పేర్కొంది. సొరంగం నిర్మాణం, దశలవారీ పనులు జరిగిన తీరుపై సమగ్ర విచారణ జరిపించాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. పనిచేసే ప్రాంతాలనుబట్టి పనిభద్రత, హెల్త్‌కోడ్‌ను కార్మికులను కల్పించాలని నొక్కిచెప్పింది. పనిప్రదేశంలో హక్కులను ప్రాథమిక హక్కుల పరిధిలోకి 2022లో జరిగిన సమావేశంలో ఐఎల్‌ఓ తీసుకు రావడాన్ని ప్రస్తావించింది. కార్మికుల ఆరోగ్యం, పనిభద్రతకు ఐఎల్‌ఓ మార్గదర్శకాలను ప్రభుత్వం ఆమోదించాలని, ఓఎస్‌హెచ్‌పై కోడ్‌తో పాటు నాలుగు కోడ్‌లను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. చట్టాల కోడీకరణపై కార్మికుల సందేహాలను నివృత్తి చేసేందుకు, సమస్యలను పరిష్కరించేందుకు సాధ్యమైనంత తర్వగా ఐఎల్‌సీ ఏర్పాటు చేయాలని కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది.

వ్యక్తిగత రుణాలపై భారం తప్పదు

ఆర్‌బీఐ గవర్నర్

ముంబై: వ్యక్తిగత రుణాలపై భారం పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ సమర్థించుకున్నారు. సుస్థిరత సాధించాలన్న లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పుకొచ్చారు. వృద్ధిని దృష్టిలో పెట్టుకునే గృహ, వాహన రుణాలను అందులోంచి మినహాయించినట్లు చెప్పారు. ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్, ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సుస్థిరత సాధించాలన్న లక్ష్యంలో భాగంగా ముందస్తుగా అన్‌సెక్యూర్డ్ రుణాలపై నిర్ణయం తీసుకున్నామని శక్తికాంత దాస్ తెలిపారు. ప్రస్తుతం బ్యాంకింగ్ వ్యవస్థపై ఎలాంటి ఒత్తిడీ లేదని, అయినప్పటికీ బ్యాంకులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ద్రవ్యోల్బణం అదుపులోకి వస్తోందని చెప్పారు. అమెరికా ట్రెజరీ ఈల్డ్స్ అధికంగా ఉన్నప్పటికీ రూపాయి స్వల్ప స్థాయిలోనే ఒత్తిడిని ఎదుర్కొందన్నారు. దేశీయంగా రూపాయి విలువ క్షీణించిన వేళ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ధరల ఒత్తిడిని అధిగమించాలంటే వ్యవసాయ మార్కెటింగ్‌లో సంస్కరణలు అవసరమని చెప్పారు. వ్యక్తిగత రుణాల విషయంలో ఆర్‌బీఐ ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ)లు ఈ తరహా రుణాలిచ్చేందుకు ఉన్న నిబంధనలను కఠినతరం చేసింది. హామీలేని వ్యక్తిగత రుణాలకు రిస్క్ వెయిట్‌ను 25 బేసిస్ పాయింట్ల మేర పెంచింది. ఈ సవరించిన నిబంధనలు గృహ, విద్య, వాహన రుణాలను ఇందులోంచి మినహాయించింది. పసిడి, పసిడి ఆభరణాల తనఖాపై తీసుకునే రుణాలకూ వర్తించవని స్పష్టం చేసింది. క్రెడిట్ కార్డు రుణాల విషయంలోనూ రిస్క్ వెయిట్‌ను 25 పర్సెంటేజీ పాయింట్లు పెంచి ప్రస్తుత 125 శాతం నుంచి 150 శాతానికి ఆర్‌బీఐ చేర్చింది.

సత్యసాయి సేవలు ఆదర్శనీయం



విశాలాంధ్ర-పుట్టపర్తి: మానవ సేవే మాధవసేవ అని బోధించిన శ్రీసత్యసాయి బాబా సేవలు అందరికీ ఆదర్శనీయమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. బుధవారం ప్రశాంతి నిలయంలోని సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్‌లో సత్యసాయి బాబా యూనివర్సిటీ 42వ స్నాతకోత్సవంలో ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గౌరవ అతిథిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. రాష్ట్రపతి ముర్ము విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ... పుట్టపర్తిలో శ్రీసత్యసాయి 98వ జయంతి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఆధ్యాత్మిక చింతన, కరుణ, పరోపకారం కలిగి సత్యసాయిబాబా అడుగుజాడల్లో నడవాలన్నారు. సత్యసాయి... సంప్రదాయ గురుకుల విద్యా విధానానికి మెరుగులుదిద్దుతూ, నేటి సమాజ అవసరాల మేరకు మార్పులు చేసి అమలయ్యేలా విద్యా సంస్థలను రూపొందించా రన్నారు. సత్యసాయి విద్యాసంస్థలు ఉత్తమ ప్రమాణాలతో కూడిన ఆదర్శ విద్యను అందిస్తున్నా యన్నారు. అందువల్లే సత్యసాయి విద్యాసంస్థలు విలువల నిలయాలుగా నిలిచాయన్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ... సత్య సాయిబాబా 42వ స్నాతకోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, ప్రేమ, సాధన వంటి వాటిని అలవర్చుకొని జీవితంలో అభివృద్ధి చెంది దేశానికి సేవలు అందించాలన్నారు. సత్యసాయి విద్యాసంస్థల్లో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారన్నారు. ప్రపంచమంతా వసుధైక కుటుంబమని ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి జీవించాలని సూచించారు.కాన్వకేషన్ పొందిన విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. వివిధ రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన శ్రీసత్యసాయి విద్యాసంస్థల విద్యార్థులకు పట్టాలతో పాటు 21 మందికి బంగారు పతకాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమానికి ముందు ట్రస్ట్ సభ్యులు ముఖ్య అతిథులను సన్మానించారు. వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ బీ రాఘవేంద్ర ప్రసాద్ కాన్వగేషన్ పొందిన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైయర్ లెర్నింగ్ (ఎస్ఎస్ఎస్ఐహెచ్ఎల్) ఛాన్స్‌లర్ కే చక్రవర్తి, రిటైర్ ఐఏఎస్, వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ బీ రాఘవేంద్ర ప్రసాద్, రాష్ట్ర మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్, సత్యసాయి సెంటర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఎస్ఎస్ నాగానంద్ తదితరులు పాల్గొన్నారు.



నేడు విశాఖలో భారత్-ఆసీస్ టీ20 మ్యాచ్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ నగరంలో భారత్-ఆస్ట్రేలియా మధ్య టీ20 మ్యాచ్ గురువారం జరగనుంది. ఇటీవల వన్డే ప్రపంచ కప్ ఫైనల్ లో టీమిండియా ఓటమి ని జీర్ణించుకోలేని క్రీడాభిమానులు టీ20 సిరీస్‌లో అయినా సత్తా చాటాలని కోరుకుంటున్నారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ విశాఖలోని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో సాయంత్రం 7గంటలకు ప్రారంభం కానుంది. ఇప్పటికే రెండు జట్లు విశాఖ నగరానికి చేరుకోగా... ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో మ్యాచ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అయితే ఏసీఏ కార్యవర్గ సభ్యులంతా అధికార వైసిపి నేతలకు, వారి అనుచరులకు అధికంగా టికెట్లు ఇచ్చారని...క్రీడాభిమానులకు టికెట్లు అందలేదన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. పేటీఎం ద్వారా టికెట్లు బుక్ చేసుకున్న వారికి సక్రమంగా కౌంటర్లు ఏర్పాటు చేయకపోవడంతో టికెట్లు అందించలేకపోయారని అనేకమంది వాపోయారు. భారత్-ఆస్ట్రేలియా క్రికెట్ మ్యాచ్ సందర్భంగా విశాఖలో పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు డీసీపీ-1 శ్రీనివాసరావు తెలిపారు. మ్యాచ్ కోసం మొత్తం 1500 మంది పోలీస్ బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు కొనసాగుతాయని, ప్రజలు సహకరించాలని కోరారు. హనుమంత వాక నుంచి మారిక వలస మధ్యలో భారీ వాహనాలకు అనుమతి లేదన్నారు. టికెట్లు ఉన్న వారి వాహనాలకు అనుమతిస్తామని చెప్పారు. ఎటువంటి తిను బండారాలను స్టేడియం లోపలకి అనుమతించమని పేర్కొన్నారు. ఆల్కాహాల్ తీసుకున్న వారిని అనుమతించడం జరగదన్నారు. వారిపై కేసులు కూడా బుక్ చేస్తామని హెచ్చరించారు. నిర్ణీత పార్కింగ్ స్థలాల్లోనే వాహనాలు నిలుపుకోవాలని, అనుమతి లేని చోట పెడితే ఆయా వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. క్రికెట్ మ్యాచ్ సాయంత్రం 7గంటలకు ప్రారంభమవుతుందని రెండు గంటల ముందు ప్రేక్షకులను స్టేడియంలో అనుమతిస్తామని వెల్లడించారు.

కెనడా వాసులకు ఈ-వీసా సేవల పునరుద్ధరణ

న్యూఢిల్లీ: ఖలిస్థానీ అంశంపై భారత్, కెనడా మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. దాదాపు 2 నెలలుగా కెనడా పౌరులకు నిలిపివేసిన ఈ-వీసా సేవలను భారత్ బుధవారం పునరుద్ధరించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. జీ20 దేశాధినేతల వర్చువల్ సమావేశానికి ముందు ఈ నిర్ణయం వెలువడటం గమనార్హం. దౌత్యపరమైన ఉద్రికత్తలతో ఈ ఏడాది సెప్టెంబరు 21 నుంచి కెనడా వాసులకు వీసా సర్వీసులను భారత్ నిలిపివేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఈ నిర్ణయాన్ని కొంత మార్చుకుంది. భద్రతాపరమైన పరిస్థితులను సమీక్షించిన అనంతరం అక్టోబర 26 నుంచి కెనడా పౌరులకు ఎంట్రీ వీసా, బిజినెస్ వీసా, మెడికల్ వీసా, కాన్ఫరెన్స్ వీసా కేటగిరీల్లో సేవలు పునరుద్ధరించారు. తాజాగా ఈ-వీసా సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు సమాచారం. దీంతో ఇప్పుడు కెనడా పౌరులకు అన్ని రకాల వీసా సర్వీసులను భారత్ పునరుద్ధరించినట్లైంది.

పంట వ్యర్థాల నిర్వహణకు తగిన ఏర్పాట్లేవి?

చండీగఢ్ : కేంద్రం, పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం పంట వ్యర్థాల నిర్వహణకు సరైన ఏర్పాట్లు చేయడం లేదని పంజాబ్‌లోని రైతు నాయకులు బుధవారం ఆరోపించారు. అలాగే, వాహనాలు, పారిశ్రామిక కాలుష్యం ఢిల్లీలో గాలి నాణ్యతను ప్రభావితం చేస్తుందే కానీ వ్యవసాయ వ్యర్థాలను తగలబెట్టడం వల్ల కాదన్నారు. నీటి ఎద్దడితో కూడిన వరి పంట నుంచి సాగుదారులను దూరం చేయడానికి మొక్కజొన్న, పప్పు ధాన్యాలు వంటి ప్రత్యామ్నాయ పంటలకు ప్రభుత్వాలు కనీస మద్దతు ధరకు హామీ ఇవ్వాలని కూడా వారు డిమాండ్ చేశారు. పంట వ్యర్థాలను తగులబెట్టడానికి సంబంధించిన వ్యాజ్యాన్ని సుప్రీం కోర్టు విచారిస్తున్నప్పుడు, రైతులను 'విలన్‌లు' గా చేస్తున్నారని ధర్మాసనం వ్యాఖ్యానించిన ఒకరోజు తర్వాత రైతులు ఈ ఆరోపణ చేశారు. కాలుష్యం కారణంగా పౌరులు, పిల్లలు నష్టపోతున్నారనే వాస్తవంతో సంబంధం లేకుండా పంట వ్యర్థాలను తగులబెట్టే రైతుల నుంచి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) విధానంలో ఎందుకు కొనుగోలు చేయాలని న్యాయమూర్తులు సంజయ్ కిషన్ కౌల్, సుధాన్షు ధులియాతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. భారతీ కిసాన్ యూనియన్ (ఏక్తా ఉగ్రహన్) ప్రధాన కార్యదర్శి సుఖ్‌దేవ్ సింగ్ కోక్రికాలన్ బుధవారం మాట్లాడుతూ కేంద్రం లేదా పంజాబ్ ప్రభుత్వం పంట వ్యర్థాల నిర్వహణ సమస్యపై నిర్దిష్టంగా ఏమీ చేయడం లేదని అన్నారు. 'మానవశక్తితతో పాటు పంట వ్యర్థాల నిర్వహణ యంత్రాలు తగినంత సంఖ్యలో, వరి గడ్డి నిర్వహణ కోసం రైతులకు ప్రోత్సాహకాలు కూడా ఇవ్వాలి' అని కోక్రికాలన్ అన్నారు. ఢిల్లీలో కాలుష్యానికి పంజాబ్ రైతులను అనవసరంగా నిందిస్తున్నారని, దేశ రాజధాని ప్రాంతంలో గాలిని కలుషితం చేయడంలో వాహన, పారిశ్రామిక కాలుష్యం ప్రధాన పాత్ర పోషిస్తోందని చెప్పారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.